# ప్రతిపక్షం

www.prathipaksham.in

శనివారం 27.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 277 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu




కోహ్లీ ఖాతాలో మరో రికార్డు 8



ఈనెల 29న శాసనసభకు కేసీఆర్ హాజరయ్యే అవకాశముందని, అసెంబ్లీ సమావేశాల తర్వాత బీఆర్ఎస్ బహిరంగ సభలు ఉంటాయని పార్టీ నేతలు తెలిపారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన తాజా పరిణామాలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి వల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై బలమైన పోరాటం అవసరమని కేసీఆర్ స్పష్టం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తెలంగాణ ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడూ స్పష్టత లేదని, చరిత్రలోనూ అదే ధోరణి కొనసాగిందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర హక్కుల పరిరక్షణ విషయంలో బీఆర్ఎస్ తప్ప మరే పార్టీకి నిజమైన పట్టింపు లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

# కాంగ్రెస్ తెలంగాణకు ద్రోహమే చేస్తోంది

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో తీవ్ర అన్యాయం

- అసెంబ్లీ సమావేశాల తరువాత బహిరంగ సభలు
- అన్యాయంపై బలమన పోరాటం అవసరం
- నీటి హక్కులు పరిరక్షించుకునే బాధ్యత బీఆర్ఎస్ పైనే
- మరే ఇతర పార్టీకి తెలంగాణపై పట్టింపులేదు
- బీఆర్ఎస్ అసెంబ్లీ సమావేశాలకు వస్తా
- బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు
- పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరబాద్, డిసెంబర్26:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్అధినేత కేసీఆర్అన్నారు. తెలంగాణకు కాంగ్రెస్ ఎప్పుడూ ద్రోహమే చేస్తోంది. బీఆర్ఎస్కు తప్ప.. మరే ఇతర పార్టీకి తెలంగాణపై పట్టింపులేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టాల్సిందేనని అన్నారు. బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు శుక్రవారం పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. ప్రజల్లోకి వెళ్దాం. ఉద్యమాన్ని నిర్మిద్దాం. నీటి హక్కులు పరిరక్షించుకునే బాధ్యత బీఆర్ఎస్ పైనే ఉందని

...:: మిగతా 2లో

# అరెస్టులకు రంగం సిద్ధం

## ట్యాపింగ్ కేసులో కీలక పరిణామాలు



- సచివాలయంలో పోలీసు ఉన్నతాధికారుల సమావేశం
- బీఆర్ఎస్అగ్రనేతల అరెస్ట్ పై సమాలోచనలు
- ప్రభాకర్ రావు కస్టోడియల్ ముగిసిన విచారణ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. సిట్ విచారణ వేగవంతం చేసింది. ఇప్పటికే రివ్యూ కమిటీలోని కీలక అధికారులను విచారణ చేసింది. అధికారుల నుంచి కీలక సమాచారం రాబట్టింది. ఇక రాజకీయ నేతల విచారణకు సిట్ సమాయత్తం అవుతోంది. ఇంటలీజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ పూర్తి కావడంతో బీఆర్ఎస్ చీఫ్ కేసీర్ తో పాటు కీలక నేతలు హరీశ్ రావు, కేటీ రామారావును మరో మారు విచారణ అనంతరం అరెస్ట్ చేస్తారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. శుక్రవారం సచివాలయంలో పోలీసు ఉన్నతాధికారుల

...:: మిగతా 2లో



## బంగ్లాలో భారత్ వ్యతిరేక నిరసనలు

విద్యార్థి నేత ఉస్మాన్ హాదీ హత్య తర్వాత ఇటీవల ఢాకాలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు ఇంకా చల్లారడం లేదు. తాజాగా శుక్రవారం నాడు ప్రార్థనల అనంతరం పలువురు భారత వ్యతిరేక నినాదాలు చేస్తూ ఢాకా యూనివర్సిటీలో ప్రదర్శన నిర్వహించారు.

7



## 20 మందికి పీఎం రాష్ట్రీయ బాల పురస్కారాలు

వివిధ రంగాల్లో ప్రతిభ చూపించిన పిల్లలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారా'లను బహూకరించారు. 18 రాష్ట్రాలకు చెందిన 20 మంది పిల్ల పురస్కారాలు అందుకున్నారు.

7

# 'రైతు భరోసా' కొనసాగుతుంది



- పుకార్లు నమ్మొద్దంటూ ప్రభుత్వం వెల్లడి
- రైతు భరోసా కింద 65 లక్షల మందికి లబ్ధి
- లబ్ధిదారులను తప్పదోవ పట్టించేందుకే
- పథకం నిలిపివేస్తున్నారని ప్రచారం
- ఫ్యాక్ట్ చెక్ విభాగం సోషల్ మీడియా'ఎక్స్'లో పోస్టు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, డిసెంబర్26:** రైతు భరోసా పథకం కొనసాగుతుందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న రైతు భరోసా పథకాన్ని నిలిపివేస్తున్నారంటూ సోషల్ మీడియా వేదికగా జరుగుతోన్న ప్రచారాన్ని ప్రభుత్వం ఖండించింది. ఇందులో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఇలాంటి వార్తలు పూర్తిగా నిరాధారం, అవాస్తవం, దురుద్దేశంతో కూడినవేనని పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వానికి సంబంధించిన ఫ్యాక్ట్ చెక్ విభాగం సోషల్ మీడియా'ఎక్స్'లో పోస్టు పెట్టింది.


**రైతుభరోసా పథకాన్ని నిలిపివేయట్లేదు...**

రైతు భరోసా కింద తెలంగాణలో దాదాపు 65 లక్షల మందికి పైగా అన్నదాతలు లబ్ధి పొందుతున్నారని, ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడంలేదని ఫ్యాక్ట్ చెక్ విభాగం పేర్కొంది. ప్రస్తుతం సంబంధిత జిల్లా కమిటీలు నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేవిధంగా చూసేందుకు క్షేత్రస్థాయి వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లుగా వెల్లడించింది. అలాగే, ఆర్థిక శాఖ సైతం లబ్ధిదారులకు చెల్లింపులు చేసేందుకు వారి జాబితాను సిద్ధం చేసి తిరిగి తనిఖీ కూడా నిర్వహిస్తోందని ఫ్యాక్ట్ చెక్ విభాగం పోస్టు చేసింది. రైతు భరోసా

...:: మిగతా 2లో

# బరాబర్ నా తండ్రి పేరు చెప్పుకుంటా

- రేవంత్ కూడా మంచి పనులు చేస్తే..
- ఆయన పిల్లలు పేరు చెప్పకుంటాడు
- లేదంటే మనవడు కూడా పేరు చెప్పకోడన్నారు.
- హామీల గురించి అడిగితే, దాడి చేస్తున్నారు
- తిటట్టడం మాకూ వచ్చు.. సంయమనం పాటిస్తున్నాం
- ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, డిసెంబర్ 26:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి వాడుతున్న భాష, ఆయన రాజకీయ ప్రయాణం , పాలనపై కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. శేరిలింగంపల్లికి చెందిన కొంత మంది నేతలు పార్టీలో చేరిన సందర్భంగా తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. పేగులు మెడలో వేసుకోవడం, గుడ్లు పీకి గోటీలాడటం వంటి మాటలు ఒక ముఖ్యమంత్రికి తగునా అని ప్రశ్నించారు. తనకు కూడా ఉర్దూ, హిందీ, తెలుగు, ఇంగ్లీషులో పొల్లు పోకుండా తిట్టడం వచ్చని, కానీ ముఖ్యమంత్రి కుర్చీకి ఉన్న గౌరవాన్ని బట్టి సంయమనం పాటిస్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ సాధించిన నాయకుడు, తన తండ్రి అయిన కేసీఆర్‌ను తిడితే ఒక కొడుకుగా ఆవేశం రావడం సహజమని, రేవంత్ తీరు చూస్తే ఎడమ కాలి చెప్పుతో కొట్టాలనిపిస్తుందని, కానీ ప్రజాస్వామ్యంపై గౌరవంతో ఆగుతున్నామని మండిపడ్డారు. గతంలో రేవంత్ రోడ్ల మీద పెయింటింగ్స్ వేసుకునేవాడని కేటీఆర్

...:: మిగతా 2లో



## స్కూళ్లలో పత్రికలు చదవడం తప్పనిసరి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇకపై పత్రికలను తప్పనిసరిగా చదవాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రాథమిక, విద్యార్థులు తప్పనిసరిగా పత్రికలను చదవాలని ప్రభుత్వం ఆదేశించింది.

7

# అర్హత లేని వారికి పథకాలు కట్

- పేదలకు పథకాల్లో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు
- 37 వేల మంది ఉద్యోగులను గుర్తించిన అధికారులు
- వారి పేర్లను తొలగించేందుకు చర్యలు
- ఉద్యోగులందరి ఆధార్ డేటా తీసుకున్న ప్రభుత్వం



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, డిసెంబర్ 26:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అనర్హులను గుర్తించి తొలగించే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. ముఖ్యంగా పేదలకు ఉద్దేశించిన పథకాల్లో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా లబ్ధిదారులుగా మారిన విషయం ఉన్నతాధికారుల పరిశీలనలో బయటపడింది. అర్హత లేని వారిని గుర్తించి లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇదే క్రమంలో మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముందని రేవంత్ సర్కార్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పేదలకు అందించే పథకాల్లో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా లబ్ధిదారులుగా ఉన్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. దీంతో వారిని గుర్తించి లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది..ప్రభుత్వ ఖజానా నుంచి ప్రతి నెలా జీతాలు తీసుకుంటున్న కొంతమంది ఉద్యోగులు నిరుపేదలకు అందాల్సిన పింఛన్లు, ఇండ్లు, చివరకు ఉపాధి హామీ కూలీ డబ్బులను కూడా పొందుతున్నట్టు అధికారిక లెక్కల్లో తేలింది. దీనికి సంబంధించి ప్రభుత్వం రూపొందించిన నివేదిక ప్రకారం..దాదాపు 37 వేల మందికి పైగా ఉద్యోగులు వివిధ పథకాల్లో లబ్ధి పొందుతున్నట్టు బయటపడింది. వీరిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో పాటు రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. ఈ జాబితాలో చిరుద్యోగులే కాదు.. ఉన్నత స్థాయి ఉద్యోగులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, వీరి పేర్లు లబ్ధిదారుల జాబితాలోకి ఎలా వచ్చాయనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం పేదలకోసం అందిస్తున్న పథకాల్లో ఏఏ పథకంలో ఎంతమంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు.. వారిలో ఎంతమంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ఎంత మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారనే వివరాలను ఉన్నతాధికారులు ఇప్పటికే సేకరించారు. ఆ డేటా ఆధారంగా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి స్పష్టమైన సిఫార్సులు చేశారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్, మినిమమ్ టైమ్ స్కేల్, స్టేట్ స్కల్ కింద జీతాలు తీసుకుంటున్న రెగ్యులర్ ఉద్యోగులకు, టైమ్ స్కేల్ ఉద్యోగులకు.. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను తక్షణమే నిలిపివేయాలని నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. వీరు నిబంధనల ప్రకారం అనర్హులని తేల్చిచెప్పారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు (47), ఎస్‌జీటీ అండ్ టీజీటీలు (71), పబ్లిక్ హెల్త్ మేనేజర్లు, లెక్చరర్లు, చివరకు సివిల్ అసిస్టెంట్ సర్జన్లు (5), జ్యుడీషియల్ మెజిస్ట్రేట్లు కూడా జాబితాలో ఉండడం గమనార్హం. వీరి పేర్లు లబ్ధిదారుల జాబితాలోకి ఎలా వచ్చాయనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఉద్యోగులందరి ఆధార్ డేటా తీసుకున్న ప్రభుత్వం.. వాటిని ప్రభుత్వ పథకాలతో సరిపోల్చింది. దీంతో ఈ లెక్కలు బయటపడ్డాయి. ఇంకొన్ని స్కీములలో

...:: మిగతా 2లో



# 'అసెంబ్లీ' కి ముహూర్తం ఫిక్స్

## డిసెంబర్ 29 నుంచి సమావేశాలు • అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు వెల్లడి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

**హైదరాబాద్, డిసెంబర్26:** తెలంగాణ శీతకాల అసెంబ్లీ సమావేశాలకు ముహూర్తం ఫిక్స్ అయ్యింది. 2025, డిసెంబర్ 29 నుంచి అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు గవర్నర్ ఆమోదంతో తెలంగాణ అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు నోటిఫికేషన్ జారీ చేశారు. అసెంబ్లీ సెషన్ ప్రారంభమైన తర్వాత సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై బీఏసీ బిజినెస్ అడ్వైజరీ కమిటీ, సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సెషన్‌లో కృష్ణా, గోదావరి నీటి కేటాయింపులు, పాలమూరురంగారెడ్డి సహా పెండింగ్ ప్రాజెక్టులపై సమగ్ర చర్చ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోన్నట్లు సమాచారం. అలాగే ఎంపీటీసీ, జెడ్పీటీపీ ఎన్నికలు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రణాళిక గురించి హౌస్‌లో డిస్కస్ చేయనున్నట్లు సమాచారం. ఓ వైపు కృష్ణా, గోదావరి నీటి కేటాయింపుల విషయంలో ప్రభుత్వంపై కేసీఆర్ విమర్శలు చేయడం..మరోవైపు ఆయనకు కౌంటర్‌గా అసెంబ్లీకి రావాలని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసరడంతో ఈ సెషన్‌పై ఉత్కంఠ నెలకొంది. బీఆర్ఎస్ పార్టీ ఓటమి పాలైనప్పటి నుంచి అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉంటున్న అపొజిషన్ లీడర్ కేసీఆర్,ఈ సారైనా అసెంబ్లీకి వస్తారా లేదా అనే దానిపై ఆసక్తి నెలకొంది.





## పద్మ అవార్డులు బిరుదులు కాదు

పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మ విభూషణ్, భారత రత్న వంటి పౌర పురస్కారాలు అధికారిక బిరుదులు కావని, వాటిని ఎవరూ తమ పేర్ల ముందు కాని, వెనుక కాని ఉపయోగించరాదని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది.

7



## శాసనసభ నూతన కార్యదర్శిగా తిరుపతి బాధ్యతలు

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్26:** శాసనసభ నూతన కార్యదర్శిగా రేండ్ల తిరుపతి బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం శాసనసభ కార్యదర్శి ఛాంబర్‌లో ప్రస్తుత లెజిస్లేటివ్ సెక్రటరీ డాక్టర్ వి. నరసింహా చార్యులు నుండి రేండ్ల తిరుపతి బాధ్యతలను స్వీకరించారు. అనంతరం అధికార నివాసంలో శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ని తిరుపతి, మండలి కార్యదర్శి నరసింహా చార్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాసనసభ నూతన కార్యదర్శి తిరుపతికి స్పీకర్ ప్రసాద్ కుమార్‌అభినందించారు.

## కేటీఆర్‌కు మతిస్థిమితం తప్పింది

- ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్




**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 26 :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు మతిభ్రమించి మాట్లాడ్తున్నాడని, ఆయనను వెంటనే మెంటల్‌ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలని ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా పాలన రెండేళ్లు పూర్తి చేసుకున్నదని, ఈ రెండేళ్లలో ప్రజల నుంచి వస్తున్న ఆధారణను చూసి కేటీఆర్‌మైండ్ దొబ్బి మాట్లాడ్తున్నారంటూ సాయి కుమర్‌మండిపడ్డారు. జూబ్లీ హిల్స్‌ఎన్నికల్లో, అలాగే ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కేటీఆర్ ను తెలంగాణ ప్రజలు చెంప చెల్లుమనిపించారన్నారు. దీంతో ఇక నేను మరో మారు కనీసం మంత్రిగా కూడా అయ్యే ఛాన్స్ లేదని గ్రహించిన కేటీఆర్ ఇష్టం వచ్చినట్లు మా ముఖ్యమంత్రిపై అవాకులు, చెవాకులు పేల్చుతున్నారన్నారు. మరో పదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందన్న నిజాన్ని తెలుసుకొన్న కేసీఆర్‌మైండ్‌బ్లాక్ అయ్యి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. పదవీ పోయినా ఇంకా అహంకారంతో మాట్లాడే కేటీఆర్ అహంకాన్ని ప్రజలు ఎప్పటికప్పుడు దించుతూ వస్తున్నారని అన్నారు.

## బరాబర్ నా తండ్రి పేరు చెప్పుకుంటా

మొదటిపేజీ తరువాయి

ఎద్దేవా చేశారు. ఏ వ్యక్తి అయినా కష్టపడి పైకి రావడం తప్పులేదని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం దొంగ పనులు, లంగా పనులు చేసి, ఓటుకు నోటు కేసులో బ్యాగులు మోస్తూ దొరికిపోయి జైలుకు వెళ్లారని విమర్శించారు. ఢిల్లీ పెద్దలకు పైసలు ఇచ్చి ముఖ్యమంత్రి పదవి తెచ్చుకున్నారని ఆరోపించారు. సీఎం పదవిలో ఉన్న వ్యక్తికి సంతోషం ఉండాలి కానీ, ప్రజలకు ఇచ్చిన హామీల గురించి అడిగితే ఏడుపు మొహం పెట్టి ఎదురుదాడి చేయడం విడ్డూరంగా ఉందన్నారు. అసెంబ్లీకి రావాలంటూ కేసీఆర్‌కు రేవంత్ సవాల్ విసరడంపై కేటీఆర్ స్పందిచారు. కేసీఆర్ బయటకు వచ్చి కేవలం ఒక ప్రెస్ మీట్ పెడితేనే ముఖ్యమంత్రికి ముచ్చెమటలు పట్టి చలిజ్వరం వచ్చింది. ఇక ఆయన అసెంబ్లీకి వస్తే రేవంత్ రెడ్డికి గుండె ఆగి చస్తాడు అని ఘాటుగా వ్యాఖ్యానించారు. కనకపు సింహాసనంపై శునకాన్ని కూర్చోబెట్టినట్లుగా నేడు తెలంగాణ పరిస్థితి తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి తీరు మార్చుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తన విద్యాభ్యాసంపై రేవంత్ చేసిన విమర్శలను కూడా కేటీఆర్ తిప్పికొట్టారు. తాను గుంటూరులో ఇంటర్ చదివితే రేవంత్ కు ఎందుకు నొప్పని, తాను ప్రపంచమంతా చదువుకున్నానని చెప్పారు. తాను ఆంధ్రాలో చదివితే తప్పని అంటున్న రేవంత్, ఆంధ్రా నుంచి అల్లుణ్ణి తెచ్చుకోవచ్చు కానీ తప్పులేదా అని ప్రశ్నించారు. రేవంత్‌ను ఇకపై చిట్టి నాయుడు అనడమే కాకుండా భీమవరం బుల్లోడు అని పిలవాలన్నారు. తన తండ్రి పేరు చెప్పుకోవడంలో గర్వపడుతున్నానని, తెలంగాణ తెచ్చిన మొనగాడు కాబట్టే బరాబర్ పేరు చెప్పుకుంటానని, రేవంత్ కూడా మంచి పనులు చేస్తే ఆయన పిల్లలు పేరు చెప్పుకుంటారని, లేదంటే మనవడు కూడా పేరు చెప్పుకోడన్నారు.



## అంబేద్కర్ నగర్ బస్తీలో మరోసారి ఉద్రిక్తతో

**ప్రతిపక్షం, హైదరాబాద్, డిసెంబర్ 26:** బంజారాహిల్స్ రోడ్ నం. 13లోని అంబేద్కర్‌నగర్ బస్తీలో అంగన్‌వాడీ కేంద్రం స్థలం కబ్జా వ్యవహారంలో శుక్రవారం మరోసారి ఉద్రిక్తత చోటు చేసుకున్నది. అంగన్‌వాడీ కోసం కేటాయించిన స్థలం తమదంటూ కొందరు ప్రైవేటు వ్యక్తులు గత కొన్నిరోజులుగా ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే బస్తీవాసులు అనేకసార్లు కబ్జాను అడ్డుకోవడంతో పాటు ఐసీడీఎస్ అధికారుల ఫిర్యాదుతో నిందితులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు సైతం నమోదైంది. యినప్పటికీ మరోసారి శుక్రవారం కొందరు ప్రైవేటు వ్యక్తులు స్థలంలోకి ప్రవేశించడంతో బస్తీవాసులు పెద్ద ఎత్తున గుమిగూడి వారితో వాగ్వాదానికి దిగారు. ఎట్టి పరిస్థితిల్లో అంగన్‌వాడీ స్థలాన్ని వదిలి పెట్టేది లేదని బస్తీవాసులు హెచ్చరించారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు అక్కడకు చేరుకుని ప్రైవేటు వ్యక్తులను పంపించి వేశారు. ఈ వ్యవహారంపై లోతుగా విచారణ చేపట్టి భవిష్యత్‌లో అంగన్‌వాడీ స్థలం కబ్జాదారుల చేతిలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



నేను బీజేపీ సైనికుడిని. కేంద్ర లేదా రాష్ట్ర నాయకులు తనను పిలిచిన రోజు మళ్లీ పార్టీలో చేరతా. అయితే ఆ సమయంలో తనకు పార్టీ పెద్ద నాయకుల నుంచి స్వేచ్ఛ ఇవ్వాలని కోరతా. ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు ఉండి, ఓ అన్నయ్య గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోతే.. ఏదో ఒక రోజు అతను ఇంటికి తిరిగి రావాల్సిందే.

- గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

## కాంగ్రెస్ తెలంగాణకు ద్రోహమే చేస్తోంది

మొదటిపేజీ తరువాయి

కేసీఆర్ అన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని అసెంబ్లీ వేదికగా వివరిద్దామని. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ద్రోహాన్ని అసెంబ్లీ వేదికగా చెబుదామని అని పార్టీ నేతలతో కేసీఆర్ అన్నట్టు సమాచారం. ఈనెల 29న శాసనసభకు కేసీఆర్ హాజరయ్యే అవకాశముందని, అసెంబ్లీ సమావేశాల తర్వాత బీఆర్ఎస్ బహిరంగ సభలు ఉంటాయని పార్టీ నేతలు తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించిన తాజా పరిణామాలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి వల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై బలమైన పోరాటం అవసరమని కేసీఆర్ స్పష్టం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు విషయంలో కేంద్రం నిర్లక్ష్య ధోరణి, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి కలిసి తెలంగాణ ప్రయోజనాలకు తీవ్రంగా భంగం కలిగిస్తున్నాయని అన్నారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఎప్పుడూ స్పష్టత లేదని, చరిత్రలోనూ అదే ధోరణి కొనసాగిందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర హక్కుల పరిరక్షణ విషయంలో బీఆర్ఎస్ తప్ప మరే పార్టీకి నిజమైన పట్టింపు లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

### అసెంబ్లీ సమావేశాలకు వస్తా

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వచ్చేందుకు సిద్ధమయ్యారు. ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో జరిగిన పార్టీ సీనియర్ నేతల సమావేశంలో ఆయన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. పార్టీ శ్రేణులతో.. ఈ నెల 29 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతానని చెప్పినట్లు సమాచారం. నీటి హక్కుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరిని, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని సభ వేదికగా ఎండగట్టాలని ఆయన నిర్ణయించారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం వంటి కీలక ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతిపక్ష నేతగా సభలో ఆయన అడుగుపెడితే అధికార కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణకు రావాల్సిన నదీ జలాల వాటాలో కేంద్రం వివక్షను, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అసెంబ్లీ వేదికగా ఎండగట్టాలని కేసీఆర్ నిర్ణయించారు. కాంగ్రెస్ పార్టీ చరిత్ర పొడవునా తెలంగాణకు ద్రోహం చేస్తూనే వచ్చిందని, ఇప్పటి ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోందని ఆయన విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా భారీ బహిరంగ సభలు నిర్వహించి.. ప్రజలను చైతన్యపరచాలని పార్టీ శ్రేణులకు ఆదేశాలిచ్చారు.

## అరెస్టులకు రంగం సిద్ధం

మొదటిపేజీ తరువాయి

సమావేశం కావడం ఇందుకు ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటికే బీఆర్ఎస్ కీలక పాత్ర ఉందని విచారణలో తేలడంతో, ఒకటి రెండు రోజులు మరో మారు కీలక నేతలను విచారించాలని నిర్ణయించినట్లు సమాచారం. విచారణ అనంతరం అరెస్ట్ చేయాలా? ఇందుకు అనుగుణంగా జరిగే పరిణామాలు, ప్రజల ఆందోళనలు ఏ మేరకు ఉంటాయన్న దానిపై పోలీసు అధికారుల సమావేశంలో చర్చించినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో కీలక నేతల అరెస్టు ఉంటుందన్న సమాచారం అందుతోంది.

### ఆరా మస్తాన్ విచారణ...

కాగా, ప్రముఖ సెఫాలజిస్ట్ ఆరా మస్తాన్ ను సిట్ ఫోన్ టాపింగ్ పైన విచారణ చేసింది. తన ఫోన్ 2000 వ సంవత్సరం నుంచి ట్యాపింగ్ అవుతున్నట్లు అనుమానించినట్లు మస్తాన్ వెల్లడించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో పోల్ స్ట్రాటజీస్ సంస్థ వ్యవస్థాపకుడు ఆరా మస్తాన్‌ను సిట్ విచారించింది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నేతృత్వంలో ఏర్పాటైన నూతన సిట్ ఈ విచారణ ప్రారంభించింది. ఇప్పటికే రెండు సార్లు పోలీసులు ఆరా మస్తాన్‌ను ప్రశ్నించింది. ఈసారి విచారణలో భాగంగా ఆయన గతంలో ఇచ్చిన స్టేట్‌మెంట్లను తిరిగి పరిశీలించి, కన్ఫర్మేషన్ కోసం అదే ప్రశ్నలను మరోసారి అడిగినట్లు తెలుస్తోంది. సిట్ అధికారులు 2020 సంవత్సరం నుంచి ఆరా మస్తాన్ వివిధ కీలక రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులతో మాట్లాడిన ఫోన్ కాల్స్ రికార్డింగ్స్‌ను సమగ్రంగా పరిశీలించారు. ఈ కాల్ డేటా ఆధారంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందా? జరిగితే ఎవరి ఆదేశాల మేరకు జరిగింది? అనే అంశాలపై సిట్ అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. సిట్ అధికారుల విచారణ అనంతరం ఆరా మస్తాన్ కీలక వ్యాఖ్యలు చేసారు. నూతనంగా ఏర్పాటు చేసిన సిట్ తనను ఈరోజు విచారణకు రావాలని పిలిచిందని అన్నారు. అధికారుల పిలుపు మేరకే తాను హాజరయ్యానని తెలిపారు. కాగా, గతంలో అడిగిన ప్రశ్నలనే మరోసారి అడిగి, తన వాంగ్మూలాన్ని నిర్ధారించుకున్నారని వెల్లడించారు. సిట్ అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు తాను స్పష్టమైన సమాధానాలు ఇచ్చానని చెప్పుకొచ్చారు. తన ఫోన్ ట్యాపింగ్ 2020 సంవత్సరం నుంచే జరుగుతోందన్న అనుమానం ఉందని తెలిపారు. అప్పటి నుంచి తన కాల్స్, కమ్యూనికేషన్‌పై నిఘా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ అంశాన్ని విచారణలో సిట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన సిట్ ఈ కేసు దర్యాప్తును వేగవంతం చేసిందని ఆరా మస్తాన్ అభిప్రాయపడ్డారు. గతంతో పోలిస్తే ఇప్పుడు విచారణ మరింత సమగ్రంగా, స్పష్ టంగా కొనసాగుతోందని చెప్పుకొచ్చారు. నూతన సిట్ దర్యాప్తు ఆధారంగా ఫోన్ ట్యాపింగ్ కేసు త్వరలోనే ఒక స్పష్టమైన దశకు చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే అవసరమైతే మరోసారి విచారణకు పిలుస్తామని సిట్ అధికారులు తనకు చెప్పారని అన్నారు. తాను చట్టపరమైన ప్రక్రియలకు పూర్తిగా సహకరిస్తానని, నిజాలు బయటకు రావాలన్నదే తన ఆకాంక్ష అని ఆరా మస్తాన్ స్పష్టం చేశారు.

### ముగిసిన విచారణ.. ఇంటికి ప్రభాకర్ రావు

ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ ముగిసింది. శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రభాకర్ రావుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల తర్వాత ప్రభాకర్ ఇంటికి వెళ్లిపోయారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో 14 రోజుల పాటు ప్రభాకర్ రావును సిట్ అధికారులు విచారించారు. ఆయన స్టేట్ మెంట్‌ను ఫైనల్ ఛార్జ్ షీట్‌లో పొందుపర్చనున్న సిట్.. జనవరి 16న సుప్రీంకోర్టుకు నివేదిక ఇవ్వనున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసు తుది అంకానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. ఈకేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావును సిట్ దర్యాప్తు బృందం 14 రోజుల పాటు విచారించింది. మొదటి దశలో డిసెంబర్ 12 నుంచి 18 వరకు ప్రభాకర్ రావును విచారించింది సిట్ బృందం. అయితే విచారణలో ఎస్ఐబీ మాజీ చీఫ్ సిట్‌కు సహకరించలేదని.. అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో డిసెంబర్ 19 నుంచి 25 వరకు మరోసారి కస్టోడియల్ విచారణకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో మొత్తం 14 రోజుల పాటు ప్రభాకర్ రావును సిట్ అధికారులు విచారించారు. ఈ కేసులో మిగిలిన నిందితులుగా ఉన్న తిరుపతన్నరావు, భుజంగరావు, రాధాకిషన్ రావును విచారించినట్లు తెలుస్తోంది. వీరందరినీ వేర్వేరుగా సిట్ అధికారులు విచారించి స్టేట్ మెంట్‌ను రికార్డు చేసినట్లు సమాచారం.

### అప్పటి సీఎం కేటీఆర్‌కే తెలియాలి

అప్పట్లో ప్రభాకర్ రావు ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న సమయంలో అప్పటి మాజీ మంత్రి హరీష్‌రావును ఎందుకు కలిశారని ప్రశ్నించగా.. అతనికి ప్రాణహానీ ఉండటంతో రక్షణ కోసం కల్పించడం కోసమే కలిసినట్లు సిట్ అధికారుల ఎదుట ఒప్పుకున్నారు. వీటితో పాటు ప్రభాకర్ రావు పదవీవిరమణ అయినప్పటికీ పదవిని కొనసాగించడంలో ఆంతర్యమేంటి అనే దానిపై ప్రశ్నించినట్లు తెలుస్తోంది. అయితే అప్పటి సీఎంగా పనిచేసిన కేసీఆర్‌కే తెలియాలంటూ సిట్ అధికారులకే ప్రభాకర్ రావు ఎదురు ప్రశ్న వేసినట్లు సమాచారం. ఈ క్రమంలో ఈ కేసుకు సంబంధించి అప్పట్లో మంత్రిగా పనిచేసిన హరీష్‌రావుతో పాటు మాజీ సీఎం కేసీఆర్‌ను కూడా విచారించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. ప్రభాకర్ రావు కుమారుడు నిశాంత్ రావును కూడా సిట్ అధికారులు విచారించారు. గతంలో ఆరువేల ఫోన్ నెంబర్లు ట్యాపరింగ్ చేసి రాజకీయ నేతలతో పాటు వ్యాపారవేత్తలను బెదిరించి వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు వచ్చాయి. ఆర్థిక లావాదేవీలపై ప్రభాకర్ రావు బంధువుల స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డ్ చేసినట్లు తెలుస్తోంది. నెలలోపు ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి దర్యాప్తును పూర్తి చేయాలని కొత్తగా ఏర్పడిన సిట్ బృందానికి ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడంతో జనవరి 16లోపు పూర్తి వివరాలు రాబట్టేందుకు సిట్ బృందం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

## అర్హత లేని వారికి పథకాలు కట్

మొదటిపేజీ తరువాయి



కూడా ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారని సెక్రటేరియెట్ వర్గాలు చెప్తున్నాయి. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'చేయూత' పథకంలోనే అత్యధికంగా ఉద్యోగులు లబ్ధి పొందుతున్నారు. అధికారుల నివేదిక ప్రకారం.. ఈ ఒక్క పథకంలోనే ఏకంగా 15,704 మంది ఉద్యోగుల వివరాలు లబ్ధిదారుల జాబితాతో సరిపోలాయి. వీరిలో అత్యధికంగా 8,273 మంది గౌరవ వేతనం తీసుకుంటున్న చిరుద్యోగులు ఉండగా, 3,202 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, 2,939 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారు. విచిత్రమేమిటంటే.. ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయి జీతాలు తీసుకునే స్టేట్ స్కేల్ రెగ్యులర్ ఉద్యోగులు 478 మంది, గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఉద్యోగులు 338 మంది కూడా ఈ పథకం కింద డబ్బులు తీసుకుంటున్నట్టు తేలింది. ఇందులో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, జూనియర్ లెక్చరర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల వంటి అనేక రకాల ఉద్యోగులు ఉన్నారు. గ్రామాల్లో పనులు దొరక్క ఇబ్బంది పడే కూలీల కోసం ఉద్దేశించిన ఉపాధి హామీ పథకంలోనూ 11,210 మంది ప్రభుత్వ ఉద్యోగులు లబ్ధి పొందుతున్నట్టు గుర్తించారు. ఇందులో సింహభాగం 7,077 మంది గౌరవ వేతనం తీసుకునే సిబ్బంది ఉన్నారు. అలాగే 2,214 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, 1,124 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఉపాధి హామీ డబ్బులు పొందుతున్నారు. ఆశ్చర్యకరంగా.. 351 మంది రెగ్యులర్ ఉద్యోగులు కూడా ఉపాధి హామీ కూలీ డబ్బులు తీసుకున్నవారి జాబితాలో ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. ఇందిరమ్మ ఇండ్ల పథకంలోనూ ఉద్యోగులు భారీగానే లబ్ధి పొందారు. మొత్తం 9,135 మంది ఉద్యోగులు ఇండ్లు పొందినట్టు లేదా మంజూరు చేయించుకున్నట్టు డేటాలో తేలింది. వీరిలో 5,177 మంది హానరోరియం సిబ్బంది కాగా, 2,256 మంది కాంట్రాక్ట్, 1,371 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఇక 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకం కింద 1,444 మంది ఉద్యోగులు లబ్ధి పొందుతుండగా, వారిలోనూ హానరోరియం (954), కాంట్రాక్ట్(328) సిబ్బందే అధికంగా ఉన్నారు. డేటా ఆధారంగా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి స్పష్టమైన సిఫార్సులు చేశారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్, మినిమమ్ టైమ్ స్కేల్, స్టేట్ స్కేల్ కింద జీతాలు తీసుకుంటున్న రెగ్యులర్ ఉద్యోగులకు, టైమ్ స్కేల్ ఉద్యోగులకు.. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను "తక్షణమే నిలిపివేయాలి" అని నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. వీరు నిబంధనల ప్రకారం అనర్హులని తేల్చిచెప్పారు. అయితే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సర్వీసులు, డైలీ వేజ్, హానరోరియం (గౌరవ వేతనం) తీసుకునే సిబ్బంది విషయంలో ప్రభుత్వం ఒక విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అధికారులు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ ఆదాయ పరిమితి ఆధారంగా ఇస్తున్నందున.. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కూడా అనర్హులుగా పరిగణించాలా? లేదా? అనే అంశంపై ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకోనుంది. ఒకవేళ సర్కారు కఠిన నిర్ణయం తీసుకుంటే మాత్రం.. దాదాపు 37 వేల మంది ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలన్నీ నిలిచిపోనున్నాయి.

## 'రైతు భరోసా' కొనసాగుతుంది

మొదటిపేజీ తరువాయి

నిలిపివేస్తున్నారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పేర్కొంది. ఇది లబ్ధిదారులను తప్పుదోవ పట్టించేదిగా ఉందని ఎక్స్ లో చేసిన పోస్టులో తెలిపింది.

### శాటిలైట్ మ్యాపింగ్ గురించి...

ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం తెలిపిన వివరాల ప్రకారం వాణిజ్య వినియోగంలో ఉన్న భూములకు సంబంధించి రైతు భరోసా పథకం ప్రయోజనాలు పొందుతున్న వారిని ఆ జాబితా నుంచి తొలగించేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ వర్సిటీ జర్మన్ టెక్నాలజీ సాయంతో 'శాటిలైట్ మ్యాపింగ్'ను' నిర్వహిస్తోంది. 2024లో చేపట్టిన ఒక గ్రౌండ్ సర్వే ప్రకారం దాదాపు నాలుగు లక్షల ఎకరాల భూమి ముఖ్యంగా హైదరాబాద్ నగరం చుట్టుపక్కల, ఓఆర్ఆర్ (ఔటర్ రింగు రోడ్డు), ఆర్ఆర్ఆర్ పరిధిలో వాణిజ్య వినియోగంలో ఉంది. ఈ మ్యాపింగ్ ప్రక్రియ ద్వారా ప్రతి లబ్ధిదారుడి వద్ద ఎంత భూమి సాగు విస్తీర్ణంలో ఉందనేది నిర్ధారించొచ్చు. "రైతు భరోసా పథకం కింద గతేడాది దాదాపు రూ.8,500 కోట్ల నుంచి రూ.9వేల కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశాం. ఈ పథకం విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి షరతులను విధించలేదు. రైతులు రబీ/ఖరీఫ్ కాలాల్లో ఆయా పంటలు పండించవచ్చు. అలాంటి వారు కూడా ఈ రైతు భరోసాకు అర్హులే. ఒక సీజన్‌లో ఒకే పంట పండించిన రైతులకు కూడా ఆర్థిక సహాయం అందిస్తున్నాం. అర్హులైన వారికి రెండు సీజన్లకు ఎకరానికి రూ.12 వేలు చొప్పున అందుతుంది.

### అభ్యంతరాలుంటే ఇలా

ఒకవేళ జాబితా నుంచి పేర్లు తొలగించినా, అభ్యంతరాలు ఏమైనా ఉన్నా వివరణ కోసం రైతులు జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి రెవెన్యూ(డీఆర్వో) అధికారులను సంప్రదించవచ్చు. గతేడాది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం 90 రోజుల వ్యవధిలో పూర్తి చేయాల్సిన రైతు భరోసా నగదు పంపిణీ కార్యక్రమాన్ని కేవలం 9 రోజుల్లోనే పూర్తి చేసి రికార్డు సృష్టించింది. నిజమైన లబ్ధిదారులకు నష్టం జరగకుండా ఉండేవిధంగా చూడాలని సీఎం ఆదేశించారు. ప్రజలు ఎవరూ రైతు భరోసాపై దుష్ప్రచారాలు, అసత్య వార్తలను నమ్మొద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అర్హులైన వారందరికీ రైతుభరోసా అందుతుందని స్పష్టం చేసింది.

# కనీవినీ ఎరుగని రీతిలో 'మేడారం' జాతర

- 200 ఏళ్లు నిలిచేలా గద్దెల పునర్నిర్మాణ పనులు
- మేడారం అభివృద్ధిపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి
- ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట
- ప్రతి నిర్మాణంలో సంస్కృతికి ప్రతిబింబించేలా చర్యలు
- 930 ఏళ్ల నాటి కోయల తాళపత్ర గ్రంథాల్లోని విశేషాలకు శిల్ప రూపం
- రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



**ప్రతిపక్షం ప్రతినిధి, ములుగు, డిసెంబర్26:** ప్రపంచ చరిత్రలోనే సమ్మక్క సారలమ్మ మహా జాతర నిర్మాణ పనులు ఒక మైలు రాయిగా నిలిచిపోతాయని, నిర్మాణ పనులు 200 ఏళ్లపాటు చెక్కుచెదరకుండా ఉండేలా చేపడుతున్నామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ ,పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అనసూయ పేర్కొన్నారు. 4 వేల టన్నుల గ్రానైట్ పై ఆదివాసీ చరిత్ర సంస్కృతి తెలియజేసే 7,000 బొమ్మలతో సమ్మక్క సారలమ్మ నిర్మాణం పనులు వేగవంతంగా సాగుతున్నాయని స్పష్టం చేశారు. శుక్రవారం ములుగు జిల్లా మేడారంలో సమ్మక్క సారలమ్మ పునర్ నిర్మాణం పనులు పరిశీలించేందుకు హైదరాబాదు నుంచి మీడియా ప్రతినిధుల బృందం వచ్చింది. సమ్మక్క సారలమ్మ చరిత్ర, పునర్నిర్మాణ నిర్మాణ పనులు ఆదివాసీల మూలాలు జాతర చరిత్రను మీడియా బృందానికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మేడారం సమ్మక్కసారలమ్మ మహా జాతరను ఈసారి కొత్త రూపుతో.. వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు.. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి 31 వరకు జరిగే జాతరకు తెలంగాణతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి కోటి మందికి పైగా భక్తులు తరలి వస్తారని అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. ఈసారి ఎప్పుడూ కల్పించే తాత్కాలిక సౌకర్యాలతోపాటు శాశ్వత నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని ఎన్నడూ లేనివిధంగా రూ.251 కోట్లతో మేడారం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. ఇందులో ప్రధానంగా వనదేవతల గద్దెల విస్తరణ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందనీ ఈ పనులకే రూ.101 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ఆదివాసి పూజార్ల సంఘం ప్రతినిధుల ఆమోదంతోనే పునర్నిర్మాణ పనులు చేపట్టామని వివరించారు. చరిత్రలో సుమారు 250 ఏళ్ల పాటు చెక్కుచెదరకుండా నాణ్యత ప్రమాణాల్లో ఎక్కడ రాజీ పడకుండా పనులు చేపట్టేలా ప్రతినిత్యం సమీక్షిస్తున్నామని నిత్యం మంత్రుల బృందం పరిశీలిస్తూ అధికారులకు సూచనలు చేస్తూ పనులు ముమ్మరం చేస్తున్నామని తెలిపారు. ఈ పనులు తుది దశకు చేరుకున్నాయని త్వరలో పూర్తికానున్నాయని. తెలిపారు గతంలో రేవంత్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా మేడారం సందర్శించారని తెలిపారు. ఆ సమయంలో ప్రజలు ఆదివాసీలు ఆలయాన్ని విస్తరించాలని కోరగా అధికారంలోకి రాగానే తప్పకుండా ఆలయాన్ని పునర్నిర్మిస్తామని మాట ఇచ్చి నేడు నిలుపుకుంటున్నారని తెలిపారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి 251 కోట్లు మంజూరు చేశారని మేడారం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని పనులను వేగవంతం చేస్తున్నారని నిత్యం నిర్మాణం పనులను సమీక్ష చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్ హాయంలో తాత్కాలిక పనుల పేరిట నిధులను ఖర్చు ఇప్పుడు అలా కాకుండా ప్రభుత్వం పక్కా పకడ్బందీ వ్యూహంతో శాశ్వతంగా నిర్మాణ పనులు చేపడుతున్నదని చెప్పారు. చరిత్రలోనే కనీవిని ఎరుగని రీతిలో ఈ దఫా సమ్మక్క సారలమ్మ జాతరను నిర్వహిస్తున్నామని భక్తులంతా సహకరించాలని పేర్కొన్నారు.

**ఆదివాసీల సంస్కృతి పెద్దపీట**

శిలలపై ఆదివాసుల సంస్కృతికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తాళపత్రాల్లోని కోయ వంశీయుల చరిత్రను ప్రాంగణం గోడలపై చిహ్నాలుగా, బొమ్మలుగా వివరించారు. ప్రధాన స్వాగత తోరణంపై సమ్మక్క వంశీయుల చరిత్ర తెలిపే 59 బొమ్మలు చెక్కించామని పేర్కొన్నారు. దాదాపు 750 మంది కోయ వంశీయుల పేర్లకు సంబంధించి ఏడు వేల బొమ్మలుంటాయని పేర్కొన్నారు. డాక్టర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో 250 మంది శిల్పులు పనిచేశారనీ, స్థపతులు ఈమని శివనాగిరెడ్డి, డాక్టర్ మోతీలాల్ పర్యవేక్షిస్తున్నారనీ చెప్పారు సమ్మక్కసారలమ్మ ఆర్కియాలజీ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్కు చెందిన 15 మంది విద్యార్థులు ఈ చిత్రాల రూపకల్పనలో సాయం అందించారని పేర్కొన్నారు గద్దెల ప్రాంగణానికి సమీపంలో ఇదివరకు ఉన్న చెట్లను దాదాపు తొలగించకుండానే అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. వనదేవతల పూజల్లో విశిష్టత కలిగిన బండారి, మర్రి, వెదురు, బూరుగ, వేప, ఇప్ప, కస్తు వంటి 12 రకాల చెట్లు, 140 రకాల ఆయుర్వేద మొక్కలు నాటనున్నామని పేర్కొన్నారు.

# కొత్త జీఓతో జర్నలిస్టులకు ఎలాంటి నష్టం జరగదు

- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి



**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్26:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన అక్రెడిటేషన్ మార్గదర్శకాలు వృత్తిపరమైన జర్నలిస్టులను నష్టపర్చవని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం నాడు విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేసారు. సంక్షేమ చర్యలు ఎలాంటి వివక్షత లేకుండా అందరికీ వర్తించడంతో పాటు ఇంకా మెరుగైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు యోచిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వపు అక్రెడిటేషన్ ఉత్తర్వులు ఉర్దూ జర్నలిస్టుల పట్ల అనుసరించిన వివక్షతను, చిన్న పత్రికల పట్ల చూపిన చిన్న చూపును తెలంగాణ హైకోర్టు కొట్టి వేసిన అంశాలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసారు. ఈ నేపథ్యంలోనే వాటిని కొత్త జీఓలో మార్పు చేసిన విషయాన్ని ఆయన వెల్లడించారు. నూతన జీఓపై కొందరు ఉద్దేశ్యపూర్వకంగా అవాస్తవాలను వెల్లడిస్తూ, వక్రీకరిస్తూ సంక్షేమ చర్యలు విలేకరులకు మాత్రమే వర్తిస్తాయని చెబుతున్నారని ఆయన విచారం వ్యక్తం చేసారు. ఇందులో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. వృత్తిపరమైన జర్నలిస్టులందరికీ ఇవి వర్తిస్తాయని ఆయన స్పష్టం చేసారు. ఈ విషయాలపై అవసరమైతే వివరణ కొరవచ్చని ఆయన సూచించారు. జర్నలిస్టుల సంక్షేమ చర్యల పట్ల ముఖ్యమంత్రితో, సమాచార శాఖ మంత్రితో ఎప్పుడైనా మాట్లాడడానికి అవకాశాలు ఎలాగూ ఉంటాయన్నారు.

**రాజకీయ పార్టీ ముసుగులో...**

ఇందుకు విరుద్ధంగాఓ రాజకీయ ఎత్తుగడతో కొన్ని శక్తులు ఆందోళన చేయాలని తలపెట్టడం అత్యంత విచారకరమని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టుల పట్ల, వారి సమస్యల పట్ల రేవంత్ రెడ్డి నాయకత్వాన ఉన్న ప్రజా ప్రభుత్వం సానుకూల పరిష్కారానికి వెళ్తుంది తప్పా, గత ప్రభుత్వం మాదిరిగా వివక్షత చూపే అవకాశమే లేదని ఆయన తెలిపారు. నూతన జీఓపై పనిగట్టుకొని కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని విశ్వసించరాదని వర్కింగ్ జర్నలిస్టులకు శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేసారు.

# అనుమానంతో భార్య సజీవ దహనం

- భార్యపై పెట్రోలు పోసి నిప్పంటించిన భర్త
- అడ్డుకున్న కూతురిని మంటల్లోకి తోసివేత



**ప్రతిపక్షం, హైదరాబాద్, డిసెంబర్ 26:** అనుమానంతో ఓ భర్త తన భార్యను సజీవ దహనం చేశాడు. అంతటితో ఆకగకుండా ఈ దారుణాన్ని అడ్డుకోవాలని చూసిన కూతుర్ని సైతం మంటల్లోకి నెట్టేశాడు. నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దారుణ ఘటన తీవ్ర కలకలం రేపింది. నల్గొండ జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన వెంకటేష్, త్రివేణిలు గతంలో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. అయితే, కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకున్న వెంకటేష్, ఆమెను నిరంతరం వేధింపులకు గురిచేస్తూ గొడవ పడేవాడు. భర్త వేధింపులు భరించలేక త్రివేణి కొన్నిరోజుల క్రితం తన పుట్టింటికి వెళ్లిపోయింది.అయితే, ఇకపై మారుతాను, నిన్ను బాగా చూసుకుంటాను అని భార్య త్రివేణిని నమ్మించాడు వెంటకేష్. భార్యను ఒప్పించి తిరిగి హైదరాబాద్‌కు తీసుకువచ్చాడు. కానీ, వచ్చిన కొద్దిరోజులకే మళ్లీ గొడవలు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే తాజాగా ఇంట్లో పిల్లల ముందే త్రివేణిపై దాడి చేసిన వెంకటేష్, ఆమెపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. తల్లిని కాపాడుకోవడానికి వచ్చిన కూతురిని కూడా కనికరం లేకుండా మంటల్లోకి తోసేసి అక్కడి నుండి పరారయ్యాడు.

**కుమార్తెను కాపాడిన స్థానికులు**

బాధితుల అరుపులు విన్న స్థానికులు వెంటనే స్పందించి వారిని ఆసుపత్రికి తరలించారు. దురదృష్టవశాత్తు అప్పటికే త్రివేణి మృతి చెందగా, కూతురు స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుండి బయటపడింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న నల్లకుంట పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. హత్య జరిగిన 12 గంటల వ్యవధిలోనే పరారీలో ఉన్న నిందితుడు వెంకటేష్‌ను పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారు. చట్ట ప్రకారం శిక్ష పడేలా చేస్తామన్నారు.ఎలాంటి తప్పు చేయకపోయినా అనుమానం పెంచుకుని వేధిస్తున్న భర్తలు కొందరైతే.. తాము తప్పు చేసి దొరికిపోతామన్న భయంతో భర్తను హత్య చేస్తున్న భార్యలు కొందరున్నారు. ఈ మధ్య కాలంలో వివాహేతర సంబంధాలు హత్యలకు దారితీస్తున్నాయి. తమ సంబంధానికి అడ్డుగా ఉన్నారని ప్రాణాలు తీసేందుకు వెనుకాడటం లేదు.



# రాజకీయాలు హుందాగా నడపాలి

- బీఆర్ఎస్‌నేతల వ్యవహారాంపై ఎంపీ మల్లు రవి మండిపాటు

**ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్26:** రాజకీయాలు హుందాగా నడపాలి, మేము అన్నట్టే రాజకీయాలు ఉండాలి లేకపోతే ఇష్టమున్నట్టు మాట్లాడుతాము అన్నట్టుగా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. బీఆర్ఎస్ నాయకుల వ్యవహారాలను ప్రజలు గమనిస్తున్నారని, ఇది రాజకీయాలలో మంచి పరిణామం కాదన్నారు. కేటీఆర్, కేసీఆర్ లు పదే, పదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇష్టమున్నట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఒక బాధ్యత గల ప్రజా సేవకుడిగా చాలా సహనంతో వ్యవహరిస్తున్నారని మల్లు తెలిపారు. కేటీఆర్ ఎన్నో బహిరంగ సభలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ కు సమాజంలో చాలా బాధ్యత ఉంది. అది వదిలేసి తిట్ల పురాణం ఎత్తుకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీష్ రావుకు రాజకీయాలు తెలుసని, కేటీఆర్ లాంటి అవగాహన లేని వారికి ఆయన చెప్పాలని మల్లు రవి సూచించారు. హరీష్ రావు కూడా ఈ మధ్య నోరు జారుతున్నారని, ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. పదేళ్లు మీరు అధికారంలో ఉన్నారని, ఇపుడు ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని అన్నారు. ప్రజల తీర్పును గౌరవించి మనం నడుచుకోవాలని సూచించారు. మేము కూడా కేంద్రంలో ప్రతిపక్ష స్థానంలో ఉన్నామని, ప్రజలు మాకు ఇచ్చిన బాధ్యతను నెరవేరుస్తున్నామన్నారు. హుందాగా రాజకీయాలు చేస్తూ ప్రజా సమస్యలపై ప్రభుత్వానికి సలహాలు, సూచనలు చేయాలి.. కానీ ప్రస్టేషన్ తో నోటికొచ్చినట్టు మాట్లాడడం ప్రజలు సహించరని కేటీఆర్ కు హితవు పలికారు. ఇప్పటికైనా అసెంబ్లీ సమావేశాల్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొని తన అనుభవాలతో రాష్ట్రంలో ప్రజలకు మరింత మేలు ఎలా చేయవచ్చో చెప్పాలని కోరారు. సమస్యలపై చర్చించాలి, అంతేకాని నోటికి పని చెప్పడం ప్రజాస్వామ్యం కాదని మల్లు రవి తెలిపారు.



పురపాలికల విలీనంతో...

# బృహత్ నగరంగా హైదరాబాద్

**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్ 26,** జీహెచ్ఎంసీలో 27 పురపాలికల విలీనంతో హైదరాబాద్ బృహత్ నగరంగా ఆవిర్భవించిందని కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు.శుక్రవారం రాజేంద్రనగర్ , గోల్కొండ జోనల్ కమిషనర్ కార్యాలయాలను జీహెచ్ఎంసీ కమిషనర్ ప్రారంభించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ సమక్షంలోరాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ గా అనురాగ్ జయంతి, గోల్కొండ జోనల్ కమిషనర్ గా జి ముకుందరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ మాట్లాడారు. విలీనంతో నగర విస్తీర్ణం 650 చదరపు కిలో మీటర్ల నుండి 2053 చదరపు కిలో మీటర్ల కు విస్తరించిందన్నారు.విస్తీర్ణం పెరగడంతో పాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం జీహెచ్ఎంసీ వార్డులను 150 నుండి 300కు పెంచిందన్నారుజీహెచ్ఎంసీ లో ప్రస్తుతం ఉన్న 6 జోన్లను 12కు ,ప్రస్తుతం 30 ఉన్న సర్కిళ్లను 60కి పెంచడం జరిగిందన్నారు.జీహెచ్ఎంసీ లో కొత్త జోన్లుగా ఉప్పల్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, శంషాబాద్, గోల్కొండ, రాజేంద్రనగర్ లు ఏర్పాటు అయ్యాయని చెప్పారు.

# జనవరి 7 నుంచి అండర్ 19 క్రికెట్ పోటీలు

- క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ చైర్మన్ వి. హనుమంతరావు



**ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్26:** గత 18 సంవత్సరాల నుండి స్వర్గీయ రాజీవ్ గాంధీ జ్ఞాపకార్థం క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాదులో అండర్ 19, చండీగఢ్లో అండర్ 17, చెన్నైలో అండర్ 15 క్రికెట్ ఛాంపియన్షిప్ ను నిర్వహిస్తున్నట్లు క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ హైదరాబాద్ చైర్మన్ వి. హనుమంతరావు తెలిపారు. ఈ టోర్నమెంట్లో 4 దేశాలు 10 రాష్ట్రాలు పాల్గొంటున్నయని తెలిపారు. ఎల్బీ స్టేడియం విజయ్ ఆనంద్ గ్రౌండ్ అత్తాపూర్ అంబర్పేట్ వాటర్ వర్క్స్ గ్రౌండ్ లో క్రికెట్ ఛాంపియన్షిప్ జనవరి 7 నుండి 10 తారీకు వరకు జరుగుతుందని తెలిపారు. ఫైనల్ పోటీలు ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు. ఈ టోర్నీలో శ్రీలంక, దుబాయ్, మలేషియా, నేపాల్, తమిళనాడు, మహారాష్ట్ర, చెన్నై, బీహార్, విదర్భ, కర్ణాటక, బెంగళూర్, తెలంగాణ, క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ జట్లు పాల్గొంటాయని హనుమంతరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఆది అవినాష్, జనరల్ సెక్రెటరీ, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ శంభుల శ్రీకాంత్ గౌడ్, ఆర్ లక్ష్మణ్ యాదవ్ పంజలా, జ్ఞానేశ్వర్ గౌడ్, పి. నారాయణస్వామి, పంజాల ధనంజయ గౌడ్, సద్గురు శ్రీధర్ గౌడ్, నేమూరి మహేందర్, షకీల్, కుంకుమ మన్మోహన్ తదితరులు పాల్గొన్నారు. తెలిపారు

# మెరిట్ కోటాలో సీఎం అయిన రేవంత్ రెడ్డి

- కేటీఆర్‌వ్యాఖ్యలపై ఎంపీ చామల ఆగ్రహం
- నీలాగ అయ్యను చూపెట్టి రాజకీయంలోకి రాలే
- బీఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ చామల



**ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 26:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు బుద్ధి, జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి మెరిట్ కోటాలో సీఎం అయ్యారన్నారు. నువ్వు మేనేజ్‌మెంట్ కోటాలో రాజకీయాల్లోకి వచ్చావంటూ కేటిఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అదే కోటాలో వచ్చి సిరిసిల్ల ఎమ్మెల్యే అయి.. మంత్రి అయ్యావంటూ వ్యంగ్యంగా అన్నారు.

రేవంత్ రెడ్డి ఇండిపెండెంట్‌గా జడ్పీటీసీ, ఎమ్మెల్యేగా గెలిచారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా.. ఒకసారి ఎంపీగా గెలిచి.. ప్రస్తుతం సీఎం అయ్యారని వివరించారు. మెరిట్ కోటా,పేమెంట్ కోటా, మేనేజ్‌మెంట్ కోటా ఎవరిదో తెలంగాణ ప్రజలకు తెలుసునన్నారు. పీసీసీ అధ్యక్షుడుగా రేవంత్ రెడ్డి అయిన తర్వాతనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. ఎప్పుడు అధికారం తమకే ఉంటుందని బీఆర్ఎస్ హయాంలో నియంత పాలన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో మిమ్మల్ని రేవంత్ రెడ్డి ఓడించి ఇంటికి పంపారని చెప్పారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి చేతిలో మీకు ఓటమి తప్పదని జోస్యం చెప్పారు. దమ్ముంటే రేవంత్ రెడ్డి ఛాలెంజ్ స్వీకరించాలంటూ కేటీఆర్‌ను ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఐరెన్ లెగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అని అభివర్ణించారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి గుండు సున్నా వచ్చిందని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో తాను ఏదో పొడిచానని చెప్పుకున్న కేటీఆర్‌ను కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజలు ఓడగొట్టారని గుర్తు చేశారు.

**పిచ్చి ఆలోచనలు మానుకోవాలి కేటీఆర్..**

పిచ్చి ఆలోచనలు మానుకోవాలంటూ కేటిఆర్‌కు ఆయన హితవు పలికారు. నిర్మాణత్మక ప్రతిపక్ష పార్టీ పాత్ర పోషించాలంటూ బిఆర్ఎస్ నేతలకు సూచించారు. కేసీఆర్‌ను అసెంబ్లీకి తీసుకుని రావాలంటూ కేటీఆర్‌కు తెలిపారు. కేసీఆర్ అసెంబ్లీకి రాకపోతే ప్రధాన ప్రతిపక్ష నేత హోదాను కేటీఆర్ తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. తద్వారా ప్రభుత్వానికి సలహాలు,సూచనలు ఇవ్వాలని కేటీఆర్‌కు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సూచించారు. తాను బూతులు మాట్లాడతానంటూ కేటీఆర్ అంటున్నారన్నారు. కట్టే, కొట్టే, తెచ్చే అనేది మీ కుటుంబానికి వర్తిస్తుందంటూ కేటీఆర్‌కు తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెలంగాణ ప్రజలను మీరు వంచించ లేదా? అని కేటిఆర్‌ను సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్ ఉద్యమకారుడి అవతారం ఎత్తి, పిట్ట కథలు కట్టి, సీఎం పదవిని అధికారాన్ని చేపట్టి.. రాష్ట్రాన్ని అప్పుల చేసి మీ కుటుంబానికి సంపద తెచ్చారని విమర్శించారు.

**హైడ్రా వల్ల నగర ప్రజలు సంతోషం**


హైడ్రా చేస్తున్న పనుల పట్ల హైదరాబాద్ నగర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో నాలాలను కబ్జాలు చేసి ఇళ్ళు నిర్మించారని.. దాంతో వానాకాలం వస్తే ఇళ్లనీ మునిగి ప్రజలకు ఆస్తి నష్టం వాటిల్లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో కాలనీలు, పార్కులను కబ్జాలు చేసి దండుపాళ్యం ముఠాలా దోచుకున్నారని మండిపడ్డారు. మీరు కబ్జాలు చేసి దోచుకున్న వాటిని హైడ్రా కూల్చివేస్తుందని హెచ్చరించారు. ప్రజల కోసం హైడ్రా కూల్చివేతలు చేపడుతోందని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో సన్న బియ్యం, రేషన్ కార్డులు, ఇళ్ళు ప్రజలకు ఇచ్చారా..? అని కేటీఆర్‌ను ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం అంటే నగదు ఇవ్వడం కాదని.. మహిళలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఇవ్వడం ద్వారా కోటి మంది మహిళలు కోటీశ్వరులు అవుతారని కేటీఆర్‌కు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సోదాహరణగా వివరించారు.



# ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి

- మేడిపల్లి గ్రామ సర్పంచ్ మల్కాపురం శ్రీనివాస్

**ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 26 :** మేడిపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని మేడిపల్లి గ్రామ సర్పంచ్ మల్కాపురం శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం గ్రామంలో ట్రాన్స్ఫార్మర్ చుట్టూ ప్రహరి, గ్రామంలో తాగునీటి పైప్ లైన్ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....గ్రామ ప్రజల సహకారంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని అన్నారు.గ్రామంలో మౌలిక వసతుల కల్పనతో పాటు నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.ఇచ్చిన హామీల అన్నింటిని నెరవేరుస్తానని అన్నారు . ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జొన్నాడ ప్రభాకర్, వార్డు సభ్యులు మమతా రమేష్,పార్వతమ్మ శేఖర్, కావలి నవీన్, మమత రాఘవేందర్, బాలరాజ్ , మధుకర్, రామచంద్రయ్య, మాధవి శ్రీశైలం ,మహేష్, గ్రామస్తులు ఉన్నారు.



ఎర్రకోట సమీపంలో జరిగిన బ్లాస్ట్‌లో 40కేజీల పేలుడు పదార్థాలు ఉపయోగించారు. 3 టన్నుల పేలుడు పదార్థాలను డిటోనేట్ కాకముందే స్వాధీనం చేసుకున్నాం. పోలీసులకు అవసరమైన కామన్ ఏటీఎస్‌విధానాన్ని డీజీపీలు త్వరలో అమలులోకి తేవాలి. అందరూ తెలుసుకోవాలి అనే విధానంతో కాకుండా అందరికీ తెలియజేయాలి అనే ప్రిన్సిపల్‌తో ముందుకు సాగాలి.

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా

ప్రతిపక్షం
Prathipaksham.in
4
హైదరాబాద్
శనివారం
27.12.2025
@prathipaksham
prathipakshamtvtelugu

ఓపెన్ వాయిస్

# పార్టీల మధ్య పోరు పాలనపై ప్రభావం

రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలు, ముఖ్యంగా ఫోన్ టాపింగ్ కేసు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోపణలు, ప్రత్యారోపణలు రాష్ట్ర రాజకీయాలను తీవ్రంగా కదిలిస్తున్నాయి. ఈ వివాదం కేవలం గత ప్రభుత్వ దుర్వినియోగాలకు సంబంధించినది కాకుండా, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం, భారత్ రాష్ట్ర సమితి మధ్య రాజకీయ పోరుగా మారింది. ఇది రాష్ట్రంలో నీటి పంపిణీ, అవినీతి, ప్రజా సమస్యలపై దృష్టి మళ్లించే ప్రయత్నంగా కనిపిస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్ రావు నేతృత్వంలో, విపక్ష నాయకులు, వ్యాపారవేత్తలు, ఇతరుల ఫోన్‌లను అక్రమంగా ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇవి మావోయిస్టులతో సంబంధాలు ఉన్నట్లు అనుమానంతో జరిగాయని ప్రభాకర్ రావు చెప్పినట్లు వార్తలు వచ్చాయి. కానీ, ఇది రాజకీయ ప్రత్యర్థులను అణచివేయడానికి ఉపయోగపడిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ప్రస్తుత స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (ఎస్ఐటీ) దర్యాప్తులో, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావు, కేటీఆర్‌లకు నోటీసులు జారీ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. అసెంబ్లీ సమావేశాల తర్వాత నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ప్రస్తుతం ఈ కేసు మరింత తీవ్రమైంది. ప్రభాకర్ రావు మరోసారి ఎస్ఐటీ ముందు హాజరయ్యే అవకాశం ఉందని వార్తలు వచ్చాయి. మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, అనిల్ కుమార్ పేర్లు పదేపదే వినిపిస్తున్నాయి. ఈ ట్యాపింగ్ ద్వారా 6,000కు పైగా ఫోన్‌లు పర్యవేక్షించినట్లు బీజేపీ నాయకుడు బండి సంజయ్ ఆరోపించారు. ఇది కేవలం భద్రతా కారణాలు కాకుండా, రాజకీయ ప్రయోజనాల కోసమే జరిగిందని విమర్శలు ఉన్నాయి. కేసీఆర్ నిర్వహించిన ప్రెస్ మీట్ ఈ వివాదానికి మరింత ఊతమిచ్చింది. కేసీఆర్, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ డీపీఆర్‌ను కేంద్రం తిరస్కరించినా, రేవంత్ ప్రభుత్వం నిరసన చేయకపోవడాన్ని ప్రశ్నించారు.

హైదరాబాద్,

శనివారం
27.12.2025

బీజేపీని 'తెలంగాణకు శని'గా అభివర్ణించి, చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్ ప్రభావంతో బీజేపీ తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. అంతేకాక, కాంగ్రెస్‌ను 'రియల్ ఎస్టేట్ ఏజెంట్'గా చెప్తూ, ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులను విమర్శించారు. నేరాల రేటు 20% పెరిగిందని, రాష్ట్రంలో అరాచకం నెలకొందని చెప్పారు. దీనికి ప్రతిస్పందనగా, రేవంత్ రెడ్డి తన ప్రెస్ మీట్‌లో కేసీఆర్‌ను తీవ్రంగా విమర్శించారు. కేసీఆర్ తన సొంత కుమార్తె, అల్లుడి ఫోన్‌లను ట్యాప్ చేసినంత దుర్మార్గుడు మరొకరు లేడని ఆరోపించారు. కేటీఆర్ తన సోదరి కవితకు ఆస్తి ఇవ్వకుండా ఇంటి నుంచి గెంటేశాడని, ఇప్పుడు కుమార్తెల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని చెప్పారు. ఇది కేవలం వ్యక్తిగత ఆరోపణలు కాకుండా, బీఆర్ఎస్ కుటుంబ రాజకీయాలపై దాడి. కేటీఆర్ దీనికి స్పందిస్తూ, 'అసభ్యకర భాష పనికిరాదు.. మేం ఢిల్లీ బానిసలం కాదు' అని చెప్పారు. కేసీఆర్ ప్రెస్ మీట్ తర్వాత కాంగ్రెస్ నాయకులు ఆరు ప్రెస్ మీట్‌లు నిర్వహించడం, దీనిని దృష్టి మళ్లించే ప్రయత్నంగా చూడవచ్చు. నీటి పంపిణీ వివాదంలో తెలంగాణ హక్కులు కోల్పోతున్నాయని కేసీఆర్ ఆరోపించడం, బీజేపీ, కాంగ్రెస్ మధ్య రహస్య ఒప్పందం ఉందని బండి సంజయ్ చెప్పడం. ఇవి రాష్ట్రంలో మూడు పార్టీల మధ్య పోటీని తెలియజేస్తున్నాయి. బీజేపీ, రేవంత్ ప్రభుత్వాన్ని అధికార దుర్వినియోగంపై విమర్శిస్తోంది. ఈ వివాదం రాష్ట్ర పాలనపై ప్రభావం చూపుతోంది. ఒకవైపు, ఫోన్ టాపింగ్ దర్యాప్తు ప్రజా విశ్వాసాన్ని పెంచవచ్చు. మరోవైపు, ఇది రాజకీయ ప్రతీకారంగా మారితే, నిజమైన సమస్యలు (నీటి హక్కులు, అవినీతి, నేరాలు) వెనుకబడతాయి. బీఆర్ఎస్ పాలమూరు ప్రాజెక్ట్‌పై పెద్ద బహిరంగ సభలు ప్లాన్ చేస్తోంది. ఇది రాష్ట్రంలో మరిన్ని ఉద్రిక్తతలకు దారితీయవచ్చు. తెలంగాణ రాజకీయాలు ప్రస్తుతం ఫోన్ టాపింగ్ వివాదం చుట్టూ తిరుగుతున్నాయి, కానీ ఇది లోతైన సమస్యలు - నీటి హక్కులు, అభివృద్ధి, అవినీతి పై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని తెలియజేస్తోంది. రేవంత్ రెడ్డి, కేసీఆర్ మధ్య ఈ పోరు, రాష్ట్ర ప్రజలకు న్యాయం చేస్తుందా లేదా రాజకీయ లాభాలకు మాత్రమే ఉపయోగపడుతుందా అనేది సమయమే చెప్పాలి.

# ఒత్తిడి లేని జీవితానికి కేరాఫ్ జపాన్

**మనమేమో చిన్న చిన్న సమస్యలకే ఆందోళన చెందుతుంటే,వాళ్లు మాత్రం శతాబ్ద కాలం పాటు ఉల్లాసంగా ఎలా ఉండగలుగుతున్నారు? దీని వెనుక ఉన్న రహస్యం ఏమిటి? వారి ఆనందానికి, ఆరోగ్యానికి మరియు విజయానికి ప్రధాన కారణం వారు పాటించే కొన్ని పురాతన జపనీస్ సూత్రాలు. అవే ఇకిగై, గన్బత్తే మరియు కైజెన్.**



సుధాకర్ ఏవీ
9000674747

జపాన్...ఈ దేశం గురించి వినగానే మనకు గుర్తొచ్చేది వారి టెక్నాలజీ, క్రమశిక్షణ మరియు పని పట్ల వారికున్న అంకితభావం.కానీ మీకు తెలుసా? జపాన్లోని 'ఒకినావా' అనే దీవిలో ప్రజలు ప్రపంచంలోనే అత్యధిక కాలం, అంటే 100 ఏళ్లకు పైగా జీవిస్తుంటారు. అంతేకాదు, వారు చాలా ప్రశాంతంగా, ఆనందంగా,ఎలాంటి ఒత్తిడి లేకుండా తమ జీవితాన్ని గడుపుతుంటారు. మనమేమో చిన్న చిన్న సమస్యలకే ఆందోళన చెందుతుంటే,వాళ్లు మాత్రం శతాబ్ద కాలం పాటు ఉల్లాసంగా ఎలా ఉండగలుగుతున్నారు? దీని వెనుక ఉన్న రహస్యం ఏమిటి? వారి ఆనందానికి, ఆరోగ్యానికి మరియు విజయానికి ప్రధాన కారణం వారు పాటించే కొన్ని పురాతన జపనీస్ సూత్రాలు. అవే ఇకిగై, గన్బత్తే మరియు కైజెన్.

**ఇకిగై :** జీవించడానికి ఒక అర్థం 'ఇకిగై' అనేది జపాన్ ప్రజల జీవన విధానంలో అత్యంత కీలకమైన అంశం. దీనిని సింపుల్ గా చెప్పాలంటే "మీరు ఉదయాన్నే నిద్రలేవడానికి గల కారణం". చాలామందికి తమ జీవితంలో ఏం చేయాలో, తమ గమ్యం ఏంటో తెలియక సతమతమవుతుంటారు. కానీ ఒకినావా ప్రజలు తమ 'ఇకిగై'ని గుర్తించి, ఆ పనిలో పూర్తిగా నిమగ్నమైపోతారు. మీ ఇకిగైని కనుగొనడానికి మీరు ఈ నాలుగు అంశాలను పరిశీలించాలి మీరు దేనిని ప్రేమిస్తున్నారు?,మీకు బాగా ఇష్టమైన పని ఏమిటి?,ఏ పని చేస్తే మీకు ఆనందం కలుగుతుంది?,మీరు దేనిలో నిపుణులు?, మీకున్న ప్రత్యేక నైపుణ్యం ఏమిటి? ఏ పనిని మీరు అద్భుతంగా చేయగలరు? ప్రపంచానికి ఏం అవసర, మీ పని వల్ల నలుగురికీ ఉపయోగం ఉందా? సమాజానికి అది ఎలా సాయపడుతుంది?,దీని ద్వారా డబ్బు ఎలా వస్తుంది?, పని చేయడం వల్ల మీరు జీవించడానికి సరిపడా ఆదాయం వస్తుందా? ఈ నాలుగు ప్రశ్నలకు సమాధానం ఎక్కడైతే కలుస్తుందో అదే మీ 'ఇకిగై'. ఉదాహరణకుమీకు బొమ్మలు గీయడం ఇష్టం,మీరు అందులో ఎక్స్పర్ట్ జనాలు మీ ఆర్ట్ కోసం డబ్బులు ఇస్తారు,మరియు మీ ఆర్ట్ ద్వారా ప్రజల్లో ఒక మంచి ఆలోచన రేకెత్తించవచ్చు.ఇలా అన్నీ కుదిరినప్పుడు మీ పనిలో మీకు విసుగు అనిపించదు, ఒత్తిడి ఉండదు. మీరు ఆ పనిలో ఒక 'ఫ్లో' ను అనుభవిస్తారు. సమయం గడుస్తున్నా తెలియకుండా పని చేయగలిగే స్థితే ఈ ఫ్లో. రిటైర్మెంట్ లేకుండా జీవితాంతం ఆనందంగా పని చేయడానికి ఇకిగై ఒక అద్భుతమైన మార్గం.

**గన్బత్తే:** వదిలిపెట్టని పోరాట పటిమఇకిగై మనకు ఒక గమ్యాన్ని చూపిస్తే,ఆ గమ్యం వైపు నడిపించే శక్తి 'గన్బత్తే'. దీని అర్థం "మీ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడం" లేదా "ఎప్పటికీ వదులుకోవద్దు.జపాన్ లో కష్ట సమయాల్లో ఒకరికొకరు చెప్పుకునే మాట ఇది. "గన్బత్తే కుదసాయ్"అంటే "యచేసి పోరాడండి, మీ బెస్ట్ ఇవ్వండి" అని అర్థం. జీవితంలో కష్టాలు, సవాళ్లు అనేవి పెద్ద అలల లాంటివి. 'ది గ్రేట్ వేవ్ ఆఫ్ కనగావ' అనే ప్రసిద్ధ పెయింటింగ్ ఈ స్ఫూర్తిని చూపిస్తుంది. సముద్రంలో ఎంత పెద్ద అల ఎదురొచ్చినా, పడవ నడిపేవాళ్లు భయపడకుండా ముందుకు సాగుతూనే ఉంటారు. అలాగే మన జీవితంలో కూడా అనూహ్యమైన సమస్యలు వచ్చినప్పుడు కుంగిపోకుండా, ఫలితం గురించి



ఆందోళన చెందకుండా ప్రయత్నం చేస్తూనే ఉండాలి.చీమ మరియు మిడత కథ: గన్బత్తే స్ఫూర్తిని అర్థం చేసుకోవడానికి చీమ మరియు మిడత కథ ఒక మంచి ఉదాహరణ. వేసవి కాలంలో మిడత ఆడుతూ పాడుతూ సమయాన్ని వృథా చేస్తే, చీమ మాత్రం కష్టపడి భవిష్యత్తు కోసం ఆహారాన్ని సేకరిస్తుంది. చలికాలం వచ్చేసరికి మిడత ఆకలితో అలమటిస్తుంది, కానీ చీమ దర్జాగా బతుకుతుంది. ఇక్కడ చీమ చూపించిన ముందుచూపు, నిరంతర శ్రమ, మరియు పట్టుదలనే 'గన్బత్తే'. జపాన్ చరిత్ర చూస్తే, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఆ దేశం పూర్తిగా ధ్వంసమైంది. కానీ అక్కడి ప్రజలు నిరాశపడలేదు. 'గన్బత్తే' స్ఫూర్తితో ఒక్కో ఇటుకను పేర్చుకుంటూ దేశాన్ని మళ్ళీ నిర్మించుకున్నారు. ఈరోజు జపాన్ ప్రపంచంలోనే ఒక ఆర్థిక శక్తిగా ఎదగడానికి కారణం ఇదే. పట్టుదల, ఓర్పు, మరియు నిరంతర ప్రయత్నమే గన్బత్తే సారాంశం.

**కైజెన్ నిరంతర అభివృద్ధి**

జపాను ముఖ్యంగా టయోటా (కంపెనీని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన సూత్రం 'కైజెన్'. దీని అర్థం 'మంచి కోసం మార్పు" లేదా "రంతర అభివృద్ధి" చాలామంది ఏదైనా కొత్త పని మొదలుపెట్టినప్పుడు రాత్రికి రాత్రే అద్భుతాలు జరగాలని కోరుకుంటారు. జిమ్ కి వెళ్లిన మొదటి రోజే బరువు తగ్గాలనుకుంటారు. కానీ కైజెన్ ఏం చెప్తుందంటే.. పెద్ద పెద్ద మార్పుల కోసం ఆత్రుత పడకండి.బదులుగా, ప్రతిరోజూ చిన్న చిన్న మార్పులు చేసుకోండి. ఒక శాతం వృద్ధిని నమ్మండి అని చెబుతుంది.

**కైజెన్ ఎలా పాటించాలి?**

మీరు ఎక్కడున్నారో తెలుసుకోండి ముందుగా మీ అలవాట్లు,మీ జీవనశైలి ఎలా ఉందో విశ్లేషించుకోండి. ఏవి మంచి అలవాట్లు? ఏవి చెడ్డ అలవాట్లు? ఆరోగ్యం, కెరీర్, రిలేషన్షిప్స్ పరంగా మీరు ఏ స్థితిలో ఉన్నారో ఒక పేపర్ మీద రాసుకోండి.చిన్న అడుగులతో మొదలుపెట్టండి.ఉదాహరణకు, మీరు బరువు తగ్గాలనుకుంటే, రేపటి నుంచే కఠినమైన ఉపవాసాలు చేయకండి. బదులుగా, రేపు ఒక్క పూట జంక్ ఫుడ్ మానేయండి. లేదా ఒక 15 నిమిషాలు నడవండి. ఈ చిన్న మార్పు మీ మెదడుకు పెద్ద కష్టంగా అనిపించదు కాబట్టి, దాన్ని మీరు సులభంగా అలవాటు చేసుకోగలరు. జపనీస్ వారి ఈ మూడు సూత్రాలు ఇకిగై (జీవిత పరమార్థాన్ని తెలుసుకోవడం), గన్బత్తే (కష్టాల్లోనూ పోరాడటం), మరియు కైజెన్ (నిరంతరం చిన్న చిన్న అడుగులతో అభివృద్ధి చెందడం) కేవలం సిద్ధాంతాలు మాత్రమే కాదు. ఇవి ఆచరణీయమైన జీవన విధానాలు. మీరు కూడా మన జీవితంలో స్పష్టత లేక సతమతమవుతుంటే,ఈ రోజే పెన్ పేపర్ తీసుకోండి. మీ ఇకిగై ఏంటో వెతకండి. ఎదురయ్యే సవాళ్లకు భయపడకుండా గన్బత్తే స్పిరిట్ తో నిలబడండి. పెద్ద లక్ష్యాలను చూసి కంగారు పడకుండా కైజెన్ పద్ధతిలో చిన్న అడుగుతో ప్రయాణం మొదలుపెట్టండి. విజయం కచ్చితంగా మీ సొంతమవుతుంది.సమయాన్ని విభజించుకోండి.మీ లక్ష్యాలను షార్ట్ టర్మ్ (స్వల్పకాలిక), మీడియం టర్మ్ (మధ్యకాలిక), మరియు లాంగ్ టర్మ్ (దీర్ఘకాలిక) గోల్స్ గా విభజించుకోండి. ఒక పెద్ద పుస్తకం చదవాలంటే భయంగా ఉంటుంది. కానీ రోజుకు ఒక పేజీ చదవాలనుకోవడం చాలా సులభం. ఇలా చిన్న చిన్న విజయాలే రేపు పెద్ద విజయానికి పునాదులు వేస్తాయి.

**(వ్యాసకర్త ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు)**

# మాటల జాతరలో 'మౌన' ప్రవాహం!



ఫిరోజ్ ఖాన్
9640466464

మాటలు అలిసిపోయిన చోట, భాష తన అర్థాన్ని కోల్పోయిన వేళ, మౌనం తన నిగూఢ ప్రయాణాన్ని ప్రారంభిస్తుంది. ప్రపంచంలోని మహోన్నత ఆవిష్కరణలు, లోతైన ఆలోచనలు అన్నీ నిశ్శబ్దం అనే గర్భం నుంచే రూపుదిద్దుకున్నాయి. మౌనం అంటే కేవలం మాటలు ఆపడం కాదు, అది తనతో తాను జరుపుకునే అంతర్మథనం, సత్యంతో చేసే నిరంతర సంభాషణ. ఒక్కోసారి వేల పదాలు చెప్పలేని నిజాన్ని ఒక చిన్న నిశ్శబ్దం అత్యంత సులువుగా అర్థమయ్యేలా చేస్తుంది. శబ్దం బయటి ప్రపంచాన్ని పరిచయం చేస్తే, మౌనం లోపలి ప్రపంచాన్ని ఆవిష్కరిస్తుంది. ఇది ఆత్మ యొక్క నిశ్శబ్ద ప్రార్థనగా మారి, మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది.

**శాస్త్రీయ నిరూపణలు**

మౌనం మెదడును పునరుజ్జీవింపజేస్తుందని ఆధునిక విజ్ఞాన శాస్త్రం అత్యంత ప్రభావవంతంగా నిరూపించింది. 2013వ సంవత్సరంలో వెలువడిన 'మెదడు నిర్మాణం మరియు విధి' అనే అంతర్జాతీయ పరిశోధనా పత్రం దీనికి ప్రామాణికం. రోజుకు కనీసం రెండు గంటల పాటు నిశ్శబ్దంగా ఉండటం వల్ల మెదడులోని జ్ఞాపకశక్తికి నిలయమైన భాగంలో కొత్త కణాల పుట్టుక వేగవంతమవుతుంది. నిరంతర శబ్ద కాలుష్యం వల్ల శరీరంలో పెరిగే ఒత్తిడి హార్మోన్ల ప్రభావాన్ని మౌనం సమూలంగా తగ్గిస్తుంది. రక్తపోటును నియంత్రించడంలో, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో నిశ్శబ్దం ఒక సహజ సిద్ధమైన ఔషధంగా పనిచేస్తుంది. ఇది కేవలం ఒక భావన మాత్రమే కాదు, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే తిరుగులేని వైద్య సత్యం.

**చారిత్రక విప్లవాల్లో నిశ్శబ్ద పోరాటాలు**

ప్రపంచ చరిత్రలో అనేక సామాజిక మార్పులు నిశ్శబ్ద పోరాటాల ద్వారానే సాధ్యమయ్యాయి. 1917లో న్యూయార్క్‌లో వేలాది మంది ఆఫ్రోఅమెరికన్లు ఎటువంటి నినాదాలు చేయకుండా చేసిన 'సైలెంట్ ప్రొటెస్ట్ పరేడ్' జాతి వివక్షపై గొప్ప నిరసనగా మిగిలిపోయింది. మహాత్మా గాంధీ దేశ విభజన అల్లర్ల సమయంలో మౌన వ్రతం ద్వారానే శాంతి సందేశాన్ని వినిపించి జనాలను ఆలోచింపజేశారు. మాటల కంటే నిశ్శబ్దం ఎంత లోతుగా గుచ్చుకుంటుందో, ఎంతటి మార్పును తెస్తుందో ఈ చారిత్రక ఘటనలు నిరూపిస్తాయి. విమర్శలు ఎదురైనప్పుడు మౌనంగా ఉండటం బలహీనత కాదు, అది ఒక శక్తివంతమైన నిరసనగా మారి శత్రువును సైతం ఆలోచనలో పడేస్తుంది.



**సృజనాత్మకతకు నిశ్శబ్దమే ప్రయోగశాల**

ప్రపంచ ప్రసిద్ధ శాస్త్రవేత్తలు, కవులు, తత్వవేత్తల విజయాల వెనుక మౌనం ఒక గొప్ప తోడుగా నిలిచింది. సర్ ఐజాక్ న్యూటన్ ప్లేగు వ్యాధి సమయంలో ఏకాంత మౌనంలో గడిపినప్పుడే గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని కనుగొన్నారు. ఐన్‌స్టీన్ సాపేక్షత సిద్ధాంతం వంటి అద్భుతాలు కూడా నిశ్శబ్ద ఏకాంతంలోనే రూపుదిద్దుకున్నాయి. శబ్దం మనిషిని బాహ్య ప్రపంచపు గందరగోళంలో పడేస్తే, మౌనం అంతరాత్మ వైపు నడిపించి కొత్త ఆలోచనలకు ప్రాణం పోస్తుంది. ఆధునిక రచయితలు సైతం డిజిటల్ శబ్దాలకు దూరంగా ఉండి, నిశ్శబ్ద వాతావరణంలోనే అద్భుతమైన సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు. నిశ్శబ్దంలోనే మేధస్సు తన పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకునే అవకాశం ఉంటుంది.

**మానవ సంబంధాలలో మౌనం పాత్ర**

సాధారణంగా భాషను శబ్ద రూపంలోనే గుర్తిస్తాం, కానీ శబ్దం కంటే శక్తివంతమైన భాష మౌనం. ఒక వ్యక్తి ఆనందంలో ఉన్నప్పుడు చిరునవ్వు, తీవ్ర దుఃఖంలో ఉన్నప్పుడు కన్నీరు నిశ్శబ్దంగానే భావాలను వ్యక్తపరుస్తాయి. మానవ సంబంధాలలో అనవసర వాదనలు పెరిగినప్పుడు ఒకరి మౌనం ఆ వివాదాన్ని ఇక్కడితో ఆపగలదు. ఎదుటివారి బాధను అర్థం చేసుకోవడానికి ఓదార్పు మాటల కంటే మౌనంగా పక్కన ఉండటం ఎక్కువ భరోసానిస్తుంది. మౌనం మాట్లాడటం మొదలుపెడితే అక్కడ కపటం ఉండదు, కేవలం హృదయాల మధ్య అనుబంధం మాత్రమే ఉంటుంది. ఇది వ్యక్తిలోని పరిణతిని మరియు ఎదుటివారి పట్ల ఉన్న గౌరవాన్ని ప్రతిబింబిస్తుంది.

**ఆధ్యాత్మిక దృక్పథం**


భారతీయ సంస్కృతిలో 'మౌన వ్రతం'కి ఒక విశిష్టమైన, పవిత్రమైన స్థానం ఉంది. మునులు, ఋషులు మౌనం ద్వారానే అపారమైన మానసిక శక్తిని, ఆధ్యాత్మిక ఉన్నతిని పొందారని పురాణాలు చెబుతున్నాయి. నేటి కాలంలో 'విపాసన' వంటి ధ్యాన పద్ధతులు మౌనం యొక్క ప్రాముఖ్యతను ప్రపంచవ్యాప్తంగా చాటిచెబుతున్నాయి. అంతర్గత ప్రశాంతత కోసం, ఆత్మశుద్ధి కోసం మౌనం ఒక దివ్యమైన ఆయుధంగా ఉపయోగపడుతుంది. బాహ్య ప్రపంచంలోని అసత్యాలు, విమర్శల నుండి మనల్ని మనం కాపాడుకోవడానికి మౌనం ఒక రక్షణ కవచంలా పనిచేస్తుంది. మౌనంలోనే దైవత్వం దాగి ఉంటుందని, అది ఆత్మను పరమాత్మతో అనుసంధానిస్తుందని ఆధ్యాత్మికవేత్తలు విశ్వసిస్తారు.

**డిజిటల్ యుగంలో మౌనం**

నేటి సాంకేతిక ప్రపంచంలో మనం నిరంతరం నోటిఫికేషన్లు, సోషల్ మీడియా హోరులో మునిగిపోతున్నాం. దీనివల్ల మెదడుపై భారం పెరిగి ఏకాగ్రత సమయం క్రమంగా తగ్గుతూ వస్తోందని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. ఇటువంటి తరుణంలో 'డిజిటల్ డెటాక్స్' పేరుతో నిశ్శబ్దాన్ని ఆశ్రయించడం ఒక అనివార్యమైన అవసరంగా మారింది. రోజుకు కనీసం పది నిమిషాల మౌనం రక్తపోటును తగ్గించి, శరీరం తనను తాను బాగుచేసుకోవడానికి సహకరిస్తుంది. మాటల హోరులో కోల్పోతున్న మనల్ని మనం వెతుక్కోవడానికి మౌనం ఒక దిక్సూచిలా ఉపయోగపడుతుంది. మౌనం అనేది శూన్యం కాదు, అది అనంతమైన అర్థాల నిలయం మరియు సత్యానికి ప్రతిరూపం.

**(వ్యాసకర్త, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు)**

# ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న మహమ్మారులు



సుంకవల్లి సత్తిరాజు
9704903463

ఎపిడమిక్, ప్యాండమిక్ అనే పదాలు అంటువ్యాధులకు సంబంధించినవిగా ప్రజలు భావించడం జరుగుతున్నది. అయితే ఎపిడమిక్ కు ప్యాండమిక్ కు మధ్య ఎంతో వ్యత్యాసముంది. ఏదైనా ఒక ప్రాంతంలో సూక్ష్మజీవుల వలన, ఇతర క్రిమికీటకాల వలన కలుషితమైన ఆహారం,గాలి,నీరు వలన ఒకరి నుంచి మరొకరికి త్వరితగతిన వ్యాపించే తీవ్రమైన అనారోగ్యాన్ని వైద్య పరి భాషలో "ఎపిడమిక్" అని నిర్వచిస్తారు. గ్రీకు భాష నుండి ఎపిడమిక్ అనే పదం ఉద్భవించింది. దీనినే అంటువ్యాధి గా తెలుగులో పేర్కొంటారు. అంటువ్యాధులు తొందరగా అధికశాతం మంది ప్రజలకు సోకుతాయి. కలరా, టైఫాయిడ్, క్షయ, ప్లేగు, మశూచి, తట్టు మొదలైనవి తీవ్రమైన అంటువ్యాధులు గా పేర్కొంటారు. ఇవే కాకుండా లైంగిక పరమైన సాంక్రమిత వ్యాధిగా ఎయిడ్స్ "గ్లోబల్ ఎపిడమిక్" గా పేరొందింది.ఒక ప్రాంతంలో ప్రబలిన వ్యాధులు ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తే వాటిని ప్యాండమిక్స్ లేదా మహమ్మారులుగా పేర్కొనడం జరుగుతున్నది. 2019 చివరిలో చైనా లోని వూహాన్ నగరంలో సీఫుడ్ మార్కెట్ నుండి ఉద్భవించిన కోవిడ్ కొద్ది నెలల్లోనే ప్రపంచమంతా వ్యాపించింది. సార్స్ కోవ్2 వైరస్ వలన ఏర్పడిన ఈ వ్యాధి 2020 కల్లా తీవ్రంగా ప్రబలి ప్రపంచ దేశాలకు వేగంగా విస్తరించి, ప్రజలను భయకంపితులను చేసి, లక్షలాది మరణాలకు కారణభూతమైనది. 2020 వ సంవత్సరంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ "కరోనా వైరస్ డిసీస్" (కోవిడ్) ను మహమ్మారిగా గుర్తించి, ప్రజలను అప్రమత్తం కావాలని తీర్మానించింది. వేగంగా వ్యాపించిన కోవిడ్19 వలన భారత దేశంలో 53 వేలకు పైగా కోవిడ్ మరణాలు సంభవించాయని గణాంకాలు చెబుతున్నాయి.14 వ శతాబ్దంలో సంభవించిన ప్లేగు మహమ్మారి అనేక దశల్లో 19 వ శతాబ్దం వరకు కొనసాగిందని. ప్లేగు వలన సుమారు 50 మిలియన్ల మంది ప్రజలు ప్రపంచ వ్యాప్తంగా మరణించారు. ఇది మానవ చరిత్రలో మహా విషాదంగా "బ్లాక్ డెత్" గా పేర్కొంటారు. ఎలుకలను తినే ఈగల వలన మనుషులకు ఈ వ్యాధి సంభవిస్తుంది. వ్యాక్సిన్ ఆవిష్కరణ వైద్య శాస్త్ర రంగంలో మహా విప్లవంగా పేర్కొనాలి.రోగ నిరోధక శక్తి లోపించడం వలనే ఒకరి నుంచి మరొకరికి రోగాలు అంటుకుని మరణాలు సంభవిస్తున్నాయని, అంటు వ్యాధులు, మహమ్మారులు ప్రబలకుండా మానవాళిని రక్షించాలనే తపనతో వ్యాక్సిన్ తయారు చేయాలని భావించి, ఎన్నో పరిశోధనలు చేసి ఎడ్వర్డ్ జెన్నర్ మొట్టమొదటి సారిగా 1796 వ సంవత్సరంలో విజయవంతంగా వ్యాక్సిన్ తయారు చేసి,సత్ఫలితాలను సాధించాడు. ఈ కారణం గానే ఎడ్వర్డ్ జెన్నర్ ను "ఫాదర్ ఆఫ్ ఇమ్యునోలజీ" గా పిలుస్తారు. తర్వాత క్రమంలో పోలియో తదితర వ్యాధులకు టీకాలు కనిపెట్టారు. డిఫ్తీరియా,టెటనస్,మీజిల్స్ వంటి వ్యాధులకు కూడా వ్యాక్సిన్ లు వచ్చాయి. మన కళ్ళ ముందు కోవిడ్ కు వ్యాక్సిన్ కనిపెట్టి అనేక మంది ప్రాణాలను కాపాడడం చూసాం. ఇంకా ఎన్నో అంటువ్యాధులకు,మహమ్మారులకు టీకాలను కనిపెట్టే క్రమంలో శాస్త్రవేత్తలు, వైద్యులు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ప్రజల్లో అంటువ్యాధుల పట్ల,మహమ్మారుల పట్ల పూర్తి స్థాయి అవగాహన కలగాలి. రోగ నిరోధక శక్తి పెంపొందించుకోవడానికి కృషి చేయాలి. ఎలాంటి అంటువ్యాధులు సోకినా వాటిని అధిగమించడానికి సంసిద్ధంగా ఉండాలనే ధ్యేయం తోనే ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ప్రతీ ఏటా డిసెంబర్ 27 వ తేదీన అంతర్జాతీయ మహమ్మారుల సంసిద్ధత దినోత్సవంగా జరపాలని తీర్మానించింది. సురక్షితమైన ఆరోగ్యవంతమైన ప్రపంచ సాధనకు అవరోధంగా మారిన అంటువ్యాధుల పట్ల,మహమ్మారుల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని చాటి చెప్పడమే ఈ అంతర్జాతీయ దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యం.కోవిడ్ 19 మహమ్మారి వలన ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ప్రజలు మృత్యువాత పడడంతో ఇలాంటి మహమ్మారులను తరిమికట్టాలనే ధ్యేయంతో 2020 వ సంవత్సరం డిసెంబర్ 27 నుండి ప్రతీ సంవత్సరం "ఎపిడమిక్ ప్రిపేర్డ్ నెస్ డే" ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నది.

**(నేడు అంటువ్యాధి సంసిద్ధత అంతర్జాతీయ దినోత్సవం)**

**(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు, మోటివేషనల్ స్పీకర్)**

## రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

## రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
90102 23917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
# 8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

# ప్రజల ఆరోగ్యంపై ఎలాంటి రాజీ ఉండదు

- మెదక్ ఎంపీ రఘునందన్ రావు
- కాజిపల్లిలో కాలుష్య సమస్యలపై ప్రజా ప్రతినిధుల సమీక్ష సమావేశం



**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 26 :** పటాన్‌చెరు నియోజకవర్గం కాజిపల్లి గ్రామంలో పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్య నీరు, పర్యావరణ కాలుష్యం కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు పాల్గొని, స్థానికుల నుంచి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా, పరిశ్రమల వల్ల గ్రామ ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని, కాలుష్య నీటి వల్ల వ్యవసాయం నష్టపోతున్నదని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి కాలుష్య నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు., ప్రజల ఆరోగ్యంతో ఎలాంటి రాజీ ఉండదని, కాలుష్యానికి కారణమైన పరిశ్రమలపై చర్యలు తీసుకునేలా కేంద్ర, రాష్ట్ర స్థాయిలో పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే కాలుష్య నియంత్రణ మండలిని కలసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. సమావేశంలో గ్రామ ప్రజలు, బీజేపీ, బిఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# జీవాలకు నట్టల నివారణ మందులు తప్పనిసరి

- అమ్డాపూర్ పశువైద్యాధికారిణి దేవి రెడ్డి

**ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 26:** గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు తప్పనిసరి అందించాలని అమ్డాపూర్ పశువైద్యాధికారిణి దేవి రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో సర్పంచ్ మద్యపాగ కృష్ణ, ఉపసర్పంచ్ జితేందర్ రెడ్డితో కలిసి గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ టీకాలు అమ్డాపూర్ పశువైద్యాధికారిణి దేవి రెడ్డి వేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నట్టల నివారణ మందులు వేయడం వల్ల జీవాలు ఆరోగ్యంగా ఉంటాయని తెలిపారు. ప్రతీ గొర్రె, మేకకు నట్టల నివారణ మందు తాగించడం వల్ల అవి ఆరోగ్యంగా ఉంటాయని, త్వరగా ఎదుగుతాయని, మాంసం దిగుబడి పెరిగి రైతులకు ఆర్థిక లాభం చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మద్యపాగ శ్రీనివాస్, కృష్ణ ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.




# బాకారం జాగీర్‌కు బస్ సౌకర్యం కల్పించాలి

- సర్పంచ్ వెంకటేష్ గౌడ్

**ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 26 :** బాకారం జాగీర్ కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సర్పంచ్ వెంకటేష్ గౌడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉప సర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, వార్డు సభ్యులతో కలిసి మెహిదీపట్నం డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి బస్సు సౌకర్యం లేక వివిధ రకాల పనుల మీద మండల కేంద్రానికి ప్రయాణికులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థుల ప్రయాణ సమస్యలను పరిష్కరించడం కోసం బస్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# మహిళను వేదిస్తున్న కాంగ్రెస్ నేతకు దేహశుద్ధి

- పోలీసులకు అప్పగింత

**ప్రతిపక్షం, బాన్సువాడ, డిసెంబర్ 26:** వివాహితను నెల రోజులుగా లైంగికంగా వేధిస్తున్న కాంగ్రెస్ నేతను భర్తతో పాటు అతని స్నేహితులు దేహశుద్ధి చేసిన సంఘటన కామారెడ్డి జిల్లా బాన్సువాడలో జరిగింది. దేవేందర్ రెడ్డి టార్చర్‌ను భరించలేక తన భర్తకు ఫిర్యాదు చేయగా, బాన్సువాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మహిళను వేధిస్తుండగా రెడ్ హ్యాండగా వివాహిత భర్త పట్టుకున్నాడు. ఆసుపత్రి నుండి నడిరోడ్డుపై చెప్పులతో కొడుతూ పోలీసులకు అప్పగించాడు. దీంతో బాన్సువాడ పోలీస్ స్టేషన్‌కు పంచాయితీ చేరింది. బాధితురాలిని, ఆమె భర్తని బుజ్జగించెందుకు కాంగ్రెస్ నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఐతే సర్పంచ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కక్ష్యాపూరీతంగా తన భర్తపై ఆరోపణలు చేస్తున్నారని దేవేందర్ రెడ్డి భార్య ఆరోపించారు.



# 3లక్షల ప్రపోజల్ ఎల్‌వోసీ అందజేసిన మంత్రి వాకిటి

**ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్, డిసెంబర్ 26:** నర్వ మండలం బేకరపల్లి గ్రామానికి చెందిన సరస్వతమ్మ భర్త నరసింహులు అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్సకు వైద్య సహాయం కోసం పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్య, క్రీడా మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని సంప్రదించగా వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 3 లక్షల రూపాయల ప్రపోజల్ ఎల్‌వోసీ ను మంజూరు చేశారు. మంచి వైద్యం అంది, బాధితుడు త్వరగా కోలుకోవాలని కాంక్షించారు.



# మరో 9 గిన్నిస్ రికార్డులు లక్ష్యంగా..

- లక్ష్యంతో ముందుకు సాగుతున్న గీతం పూర్వ విద్యార్థిని శివాలి

**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 26 :** మరో తొమ్మిది గిన్నిస్ వర్డల్ రికార్డులతో చరిత్ర సృష్టించాలనే లక్ష్యంతో గీతం పూర్వ విద్యార్థిని (201620) శివాలి జోహ్రి శ్రీవాస్తవ ముందుకు సాగుతోంది. తన తల్లి కవితా జోహ్రి శ్రీవాస్తవతో కలిసి ప్రపంచంలోనే అతిపెద్ద ఓరిగామి కళా ప్రదర్శనను హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసింది.ఈ రికార్డు ప్రయత్నాలలో భాగంగా, ఓరిగామి కుక్కలు (3,500), టోపీలు (1,600), ఎలుగుబంట్లు (2,500), పైన్ ఆకులు (3,900), ఎక్స్ కవేటర్లు (3,500), డాల్ఫిన్లు (2,500), పేపర్ సర్ఫ్ డిజైన్లు (3,100), క్విల్డ్ ఏంజెల్స్ (3,500), క్విల్డ్ బొమ్మలు (2,700) అతి పెద్ద ప్రదర్శనను గీతంలో ఏర్పాటు చేసింది. దీనికి సంబంధించిన వివరాలన్నింటికీ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ వారికి పంపి, పరిశీలన తరువాత వారు అధికారక ఫలితాలను వెల్లడిస్తారు. శివాలి జోహ్రి శ్రీవాస్తవ ఇప్పటికే 21 గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ తో పేపర్ ఆర్ట్ ప్రపంచంలో ఒక ప్రసిద్ధ పేరు సాధించి, భారతదేశంలో అత్యధిక సంఖ్యలో గిన్నిస్ వరల్డ్ రికార్డులను కలిగి ఉన్న వ్యక్తిగా నిలిచారు. ఆమె సాధించిన విజయాలలో వేలకొద్దీ చేతితో తయారు చేసిన కాగితపు బొమ్మలు, క్విల్డ్ పువ్వులు, ఓరిగామి జంతువులు, వాహనాలు, పక్షులు, ఆకులు, అలంకాల రూపాల రికార్డు బద్దలు కొట్టే ప్రదర్శనలు ఉన్నాయి. ఇవి అసాధారణమైన ఖచ్చితత్వం, సృజనాత్మకత, అంకితభావాన్ని ప్రతిబింబిస్తాయి.



శివాలి గిన్నిస్ రికార్డులతో పాటు 15 అసిస్ట్ వరల్డ్ రికార్డులు, 15 యూనిక్ వరల్డ్ రికార్డులను సాధించింది. ఇవి ఓరిగామి, క్విల్లింగ్ కళలో ఆమె అసాధారణ ప్రతిభ, పట్టుదలను ఎలుగెత్తి చాటుతున్నాయి. గీతం ఉన్నతాధికారులు హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగంక్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్, గణిత శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.మల్లికార్జునరెడ్డి, వివిధ విభాగాధిపతులు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు శివాలి ఈ కొత్త ప్రపంచ మైలురాళ్లను సాధించాలని అభిలషిస్తున్నారు.

# ఉద్యోగాలు ఇప్పిస్తానని మహిళ మోసం

- పోలీసుల కేసు నమోదు


**ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 26:** ఉద్యోగాలిప్పిస్తానని ఓ మహిళ నిరుద్యోగులను మోసం చేసిన ఈ ఘటన నగరంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన రామావత్ రాజు డిగ్రీ పూర్తిచేశాడు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో అతడికి శ్రీనివాస్ అనే మిత్రుడు ద్వారా గొబ్బి స్వరూప అనే మహిళ పరిచయమైంది. ఆమె తాను ఆర్అండ్‌బీ డిపార్ట్‌మెంట్ లో పీఏవోగా పని చేస్తున్నట్లు పరిచయం చేసుకుంది. రోడ్లు భవనాల శాఖలోనే జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని స్వరూప బాధితుడు రాజు వద్ద నుంచి రూ.4 లక్షలు తీసుకుంది. తన మిత్రుడి వద్ద కూడా రూ.8 లక్షలు తీసుకొని ఏడాదిగా ఉద్యోగం ఇప్పిస్తానని మభ్యపెడుతూ వస్తోంది. ఉద్యోగం ఇప్పించకపోవడంతో తమ డబ్బు వాపస్ ఇలవ్వాలని ఆమె పై ఒత్తిడి చేశారు. దీంతో ఆమె డబ్బులిచ్చేది లేదు. ఏమైనా చేసుకోండి అంటూ వారినే బెదిరించింది. దాంతో బాధితులు రాజు, శ్రీనివాస్‌లు నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్‌లో స్వరూప పై ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లను ఇచ్చాకనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

**ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 26 :** ప్రభుత్వం అధికారకంగా 42 శాతం రిజర్వేషన్లను ఇచ్చాకనే రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ గాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. అందులో భాగంగా రాబోవు రోజుల్లో అన్ని పార్టీలతో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. హైదరాబాద్ లో శుక్రవారం బీసీ జేఏసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్లు పెంచాలనే ప్రధాన డిమాండ్‌తో బీసీ జేఏసీ ఆందోళన కార్యక్రమాల పేరుతో ఇప్పటికే ఇటు గల్లి నుండి అటు ఢిల్లీ వరకు ఎన్నో పోరాటాలు చేయడం జరిగిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వచ్చినాకనే పంచాయతీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్తో చాలా పోరాటాలు చేశాం కానీ, కోర్టుల జోక్యంతో పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యాయి. బీసీ సంక్షేమ సంఘం పిలుపుతో జనరల్ స్థానాల్లో కూడా బీసీలు అత్యధికంగా 51శాతం స్థానాలను కైవసం చేసుకోవడం ఇది చాలా మంచి పరిణామం అని అన్నారు. భవిష్యత్తులో బస్సు యాత్ర వివిధ కార్యక్రమాలు ఉంటాయని అన్నారు. బీసీ జేఏసి రాష్ట్ర సమావేశంలో నిజామాబాద్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్, బీసీ జేఏసీ కోచైర్మన్ గుజ్జ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రేపు గొర్రెపాటి మాధవరావు సంస్మరణ సభ



**ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 26 :** ప్రముఖ న్యాయవాది, మానవ హక్కులనేత, రచయిత, అభ్యుదయవాది గొర్రెపాటి మాధవరావు సంస్మరణ సభ రేపు జరగనున్నట్లు ఐ ఎఫ్ టీ యూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ గుట్ట మాధవరావు నివాసం వద్ద ఉదయం 11 గం లకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన వెల్లడించారు. గొర్రెపాటి మాధవరావు మొదటి సంస్మరణ సభ సందర్భంగా "రాజ్యాంగ హక్కులపై పెరుగుతున్న దాడి పౌర కర్తవ్యం " అనే అంశంపై హైదరాబాద్ న్యాయ శాస్త్ర యూనివర్సిటీ నల్సారు వైస్ ఛాన్సలర్ శ్రీకృష్ణదేవరావు స్మారకోపన్యాసం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మానవహక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యులు జీవన్ కుమార్, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్ రెడ్డి, నిజామాబాద్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఆకుల రమేష్, ట్రస్ట్ జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ ఆకుల పాపయ్య, నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిళ్ళ సాయిరెడ్డి హాజరు కానునట్లు ఆయన తెలిపారు.

# సరిపడినంత మిషన్ భగీరథ నీరు విడుదల చేయండి

- అధికారులకు స్పష్టం చేసిన జగ్గారెడ్డి, నిర్మల, కూన సంతోష్



**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 26 :** సంగారెడ్డి మున్సిపాలిటీ కి మిషన్ భగీరథ నీటి సరఫరా విషయంపై కలెక్టర్ ప్రావీణ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. జగ్గారెడ్డి, నిర్మల, కూన సంతోష్ సమక్షం లో జరిగిన ఈ సమీక్ష సమావేశం లో మిషన్ భగీరథ, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు. గతకొద్ది నెలలుగా సంగారెడ్డి పట్టణ పరిధి లో మిషన్ భగీరథ నీరు పూర్తి స్థాయిలో సరఫరా జరగడం లేదని కూన సంతోష్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సంగారెడ్డి మున్సిపాలిటీకి మిషన్ భగీరథ నుండి 9 ఎం.ఎల్.డి నీటి సరఫరా అగ్రిమెంట్ ఉండగా గత కొద్ది నెలల నుండి కేవలం 7 ఎం.ఎల్.డి మాత్రమే సరఫరా అవుతుందని కలెక్టర్ కు వివరించారు. దీనితో సంగారెడ్డి న్యూ టౌన్ కు నీటి సరఫరా లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. ఈ విషయమై మిషన్ భగీరథ అధికారులు వివరణ ఇస్తూ సింగూర్ ప్రాజెక్ట్ నుండి నీరు సరఫరా చేసే 9 పంపులలో ప్రస్తుతం ఏడు పంపులు నడుస్తున్నాయని, త్వరలో ఎనిమిదో పంప్ అందుబాటులోకి వస్తుందని అప్పుడు సరఫరా కు ఇబ్బందులు ఉండవని వివరించారు. క్రమం తప్పకుండా సంగారెడ్డి పట్టణానికి 8.5 ఎం.ఎల్.డి నీటి సరఫరా చేసేలా చూడాలని కలెక్టర్ మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఈ నీటి సరఫరా కు అదనంగా రాజంపేట్ పంప్ హౌజ్ నుండి వెలుగు ఆఫీస్ పంప్ హౌజ్ వరకు గతంలో ఉన్న ఇంటర్ కనెక్టివిటీ లైన్ ను పునరుద్ధరించాలని జగ్గారెడ్డి కలెక్టర్ ను కోరారు. తద్వారా మిషన్ భగీరథ కు అదనంగా నీటి సరఫరా జరుగుతుందని, సంగారెడ్డి మున్సిపాలిటీ కి భవిష్యత్తు లో నీటి ఇబ్బందులు ఉండవని వివరించారు. లైన్ పునరుద్ధరణ కు రూ. 40 లక్షలు ఖర్చవుతుందని మున్సిపల్ అధికారులు తెలుపగా, వెంటనే ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.



# అజ్మీర్ దర్గాకు గిలాఫ్ సమర్పించిన వినయ్ భాస్కర్

**ప్రతిపక్ష, హనుమకొండ, డిసెంబర్26 :** దర్గా షరీఫ్ 814వ ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ బుధవారం రోజున మైనార్టీ నాయకులతో కలిసి గిలాఫ్ సమర్పించారు. బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు, అన్ని మతాలకు సమ ప్రాధాన్యం ఇవ్వడం జరిగిందని అన్నారు. మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ గారు కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, మైనార్టీ నాయకులు నయీమొద్దీన్, షఫీ, ఖలీల్, అఫ్జల్, హుస్సేన్, బుబేర్, మహమూద్, తస్లీమ్, ముర్తజా, రహమాన్ పాల్గొన్నారు.

“



డబుల్ ఇంజిన్ సర్కారు వస్తేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుంది. కేంద్ర నిధులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పదేళ్లలో 2 ప్రభుత్వాలు కలిసి రూ.10 లక్షల కోట్లు అప్పు చేశాయి. దోచుకున్న ఆస్తులు కాపాడుకోవడానికి కేసీఆర్‌కుటుంబం రోడ్డెక్కింది. రేవంత్ పాలనలో రాష్ట్రం మరింత ఆగమైంది.

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ప్రాంతీయం



# మెదక్ చర్చిలో రెండో రోజు భక్తుల సందడి

**ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 26:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకలు రెండో రోజు ఘనంగా కొనసాగుతున్నాయి.శుక్రవారం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చి ప్రార్థనలు చేశారు. క్రైస్తవులే కాకుండా ఇతర మతస్థులు సైతం మెదక్ చర్చిని సందర్శించి కొవ్వొత్తులు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.చర్చి వెలుపల ఏర్పాటు చేసిన క్రిస్మస్ జాతర భక్తుల సందడితో కిటకిటలాడింది. చర్చి ప్రధాన ద్వారాలను విద్యుత్ కాంతులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చర్చిల ప్రాంగణాలు విద్యుత్ దీపాలతో మెరిసిపోతూ భక్తులను ఆకట్టుకుంటున్నాయి.భక్తులు పెద్ద ఎత్తున రావడంతో మెదక్ ఎస్పీ డివి.శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.ఇందుకు అనుగుణంగా చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.



# మెదక్ చర్చి వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలించిన అదనపు ఎస్పీ

**ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 26 :** మెదక్ చర్చి 2వరోజు భక్తుల రాక నేపథ్యంలో అదనపు ఎస్పీ మహేందర్ భద్రతా ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. చర్చి పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు,ట్రాఫిక్ నియంత్రణ చర్యలు సిసిటీవీ కెమెరాల పర్యవేక్షణ, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాంతియుతంగా వేడుకలు నిర్వహించేందుకు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భక్తులు పోలీసులకు సహకరించాలని అదనపు ఎస్పీ కోరారు. అదనపు ఎస్పీ వెంట డియస్పిలు, ప్రసన్న కుమార్,రంగా నాయక్,సీఐలు మహేష్, రామకృష్ణ,ఎసైలు,సిబ్బంది ఉన్నారు.



# గొర్రెలకు మేకలకు నటల నివారణ మందును వేయించాలి

**ప్రతిపక్షం, మిరుదొడ్డి ,డిసెంబర్ 26 :** ప్రభుత్వం గొర్రెలకు, మేకలకు ఉచితంగా అందించే నట్టల నివారణ మందును గొర్రెల కాపరులు సద్వినియోగం చేసుకోవాలని ధర్మారం గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ తెలిపారు. సిద్దిపేట జిల్లా ధర్మారం గ్రామంలో పశు వైద్యాధికారిని మౌనిక ఆధ్వర్యంలో గొర్రెలకు నట్టల నివారణ మందును ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు, మేకలకు, గొర్రెలకు వివిధ వ్యాధులు రాకుండా నివారణ టీకాలను వేయించాలని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న నట్టల నివారణ మందులను గొర్రెల కాపరులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బాలరాజు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ కేవల్ కిషన్

- రాష్ట్ర ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బోర్ర జ్ఞానేశ్వర్


**ప్రతిపక్షం,చేగుంట,డిసెంబర్ 26:** భారత కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ కేవల్ కిషన్ వర్ధంతి వేడుకలను జరుపుకోవడం అదృష్టంగా భావించాలని రాష్ట్ర ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బోర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. మెదక్ జిల్లా చేగుంట మండలం పోలంపల్లి వద్ద కామ్రేడ్ కేవల్ కిషన్ వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడుగు వర్గాల పక్షపాతిగా నిలిచిన కేవల్ కిషన్ ను ప్రత్యర్థులు మట్టు పెట్టడం బాధాకరమన్నారు. భూ పోరాటాలు చేసి ప్రజలకు భూములు పంచిన చరిత్ర కేవల్ కిషన్ కు ఉందన్నారు. ముదిరాజ్ జాతి ముద్దుబిడ్డ భూ పోరాటాల యోధుడు ప్రజల పక్షపాతి అని జ్ఞానేశ్వర్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు చొప్పరి శంకర్ ముదిరాజ్ మెదక్ జిల్లా అధ్యక్షులు పుట్టి రాజు ముదిరాజ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి తలారి బిక్షపతి ముదిరాజ్ గుండ్లపల్లి శ్రీనివాస్ అల్లుడు జగన్ మద్దెల సంతోష్ గౌడుగు శ్రీనివాస్ పిట్ల నగేష్ పాల్గొన్నారు. అద్దకు ముందు మాజీ ఎమ్మెల్సీ బండ ప్రకాష్ ముదిరాజ్ వైద్య విధాన పరిషత్ మాజీ చైర్మన్ వీణ కుమారి కామ్రేడ్ కేబుల్ కిషన్ కుమారుడు కుమార్ చిన్న శంకరంపేట మాజీ ఎంపీపీ బోయిని అరుణ బోనగిరి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం బండ్ల బోనాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

# అయినాపూర్ వార్డు మెంబర్ ఆత్మహత్య



**ప్రతిపక్షం, కొమురవెల్లి, డిసెంబర్ 26 :** గ్రామానికి మంచి చేద్దామని వార్డు సభ్యునిగా గెలిచిన ముచ్చట తీరకముందే ఆత్మహత్య రూపంలో కాటేసిన ఘటన మండలంలోని అయినాపూర్ లో చోటు చేసుకుంది. శుక్రవారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల జరిగిన స్థానిక సంస్థ ఎన్నికలలో గ్రామంలో 11 వార్డు సభ్యునిగా గెలిచిన దండు భానుచందర్ (30) బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్య హత్నాకి ప్రయత్నించాడు. వెంటనే స్థానికులు గమనించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం హైదరబాద్ లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. అతని మృతికి ఓ వివాహిత కారణమంటూ కుటుంబ సభ్యులు సదరు మహిళ ఇంటి ముందు మృతదేహాన్ని ఉంచి నిరసన తెలుపడంతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు ఆ వివాహిత మహిళాను చితక బదడంతో ఉద్రిక్తత నెలకొంది. గజ్వేల్ ఏసీపీ నర్సింహులు మృతుని కుటుంబ సభ్యులకు సర్దిచెప్పిన మృతుని కుటుంబ సభ్యుల ఆందోళ కొనసాగిస్తున్నారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకొని సమస్య సర్దుమనిపించెంత వరకు కొంత సమయం వరకు గ్రామంలో ఉద్రిక్త వాతావారణం నెలకొనడంతో పోలీసులు మొహరించారు.

“



మనిషికి నిజమైన సంతోషం మానసిక సంతృప్తిలోనే ఉంది. మనిషికి సుఖదుఃఖాలు తాత్కాలికం. ఎంత సంపాదించినా మనసుకు తృప్తి లేకపోతే ఆనందం ఉండదు. క్షమాగుణమే మనిషిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తుంది. సరైన మార్గంలో పయనిస్తే లక్ష్యం తప్పక చేరుతామని స్వామి వివేకానంద నిరూపించారు.
- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

# బొల్లారంలో ఖేలో ఇండియా స్టేడియం

- 30 కోట్ల రూపాయలతో ఇండోర్ స్టేడియం, సింథటిక్ ట్రాక్
- ఆధునిక సౌకర్యాలతో స్టేడియం నిర్మాణం
- 20 కోట్ల రూపాయలతో పాటి వివేకానంద స్వామి స్టేడియం అభివృద్ధి
- పటాన్చెరు మైత్రి మైదానం వేదికగా ఖేలో ఇండియా కబడ్డీ శిక్షణ అకాడమీ
- శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి



**ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 26 :** శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బొల్లారం డివిజన్ పరిధిలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించడంతోపాటు క్రీడాకారులకు మెరుగైన వసతులతో కూడిన స్టేడియం అందించాలన్న సమున్నత లక్ష్యంతో 30 కోట్ల రూపాయలతో ఖేలో ఇండియా క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకి ప్రతిపాదనలు పంపినట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ఖాసీం బేగ్, బొల్లారం డిప్యూటీ కమిషనర్ కిషన్ లతో స్టేడియం ఏర్పాటుపై ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొల్లారం డివిజన్ పరిధిలో స్టేడియం ఏర్పాటు కోసం గతంలోనే ఐదున్నర ఎకరాలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ స్థలంలోనే కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఖేలో ఇండియా స్టేడియం ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపుతున్నామని తెలిపారు. 9:30 కోట్ల రూపాయలతో సింథటిక్ ట్రాక్, 14 కోట్ల రూపాయలతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. ముత్తంగి డివిజన్ పరిధిలోని పాటి శివారులో ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద స్టేడియాన్ని అభివృద్ధి పరిచేందుకు 20 కోట్ల రూపాయలు కేటాయిస్తూ పరిపాలన అనుమతులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. అతిత్వరలో నిధులు మంజూరు కాబోతున్నాయని తెలిపారు.. స్టేడియం పరిధిలో 10 కోట్ల రూపాయలతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, మూడు కోట్ల 15 లక్షల రూపాయలతో స్విమ్మింగ్ పూల్, 6 కోట్ల 50 లక్షల రూపాయలతో సింథటిక్ ట్రాక్, 35 లక్షల రూపాయలతో బాక్స్ క్రికెట్ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడంలో భాగంగా పటాన్చెరు మైత్రి మైదానంలో ఖేలో ఇండియా కబడ్డీ అకాడమీ మంజూరు అయిందని తెలిపారు. 20 సంవత్సరాల లోపు బాలురు, బాలికలు కబడ్డీ క్రీడలో శిక్షణ పొందవచ్చును తెలిపారు. చిన్న కేంద్రం ఏర్పాటుకు ఏడు లక్షల రూపాయలు మంజూరు అయ్యాయని తెలిపారు. రాబోయే జనవరి నెలలో అకాడమీ ప్రారంభించనున్నట్లు తెలిపారు. పటాన్చెరు నియోజకవర్గాన్ని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దాలన్న సమూన్నత లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా ప్రతి ఒక్కరు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు తన సొంత నిధులతో క్రీడలను క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు. ఈ సమావేశంలో జిన్నారం మాజీ జెడ్పిటిసి బాల్రెడ్డి పాల్గొన్నారు.



# అయ్యప్ప దేవాలయంలో గణపతి హోమం

**ప్రతిపక్షం,మెదక్ టౌన్,డిసెంబర్ 26:** మెదక్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా మండల పూజ వేడుకలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి.ఆలయ ప్రాంగణంలో గణపతి హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వైద్య రాజు పంతులు పర్యవేక్షణలో శ్రీనివాస్ శర్మ బ్రాహ్మణ బృందం ఈ పూజ కార్యక్రమాలు జరిపారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప మాల దారులు,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలి

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 26:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు.శుక్రవారం పాపన్నపేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.పీహెచ్సీలోని రక్తపరీక్షల గది, మందులు అందజేసే గది, ఇన్ పేషెంట్ వార్డ్, బెడ్స్, టాయిలెట్స్, వాక్సినేషన్ ను పరిశీలించారు.ప్రతిరోజూ హాస్పిటల్ కు ఎంత మంది రోగులు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వలన్నారు. ఇప్పటికే నిర్దేశించిన ప్రసవ లక్ష్యాలను చేరుకునేందుకుగాను అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో ఆరోగ్య సేవలు మరింత మెరుగుపడ్డాయాన్నారు.హాస్పిటల్ కు వచ్చే రోగులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై వివరించాలని సూచించారు.కలెక్టర్ వెంట హాస్పిటల్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.



# క్యాలెండర్‌ను ఆవిష్కరించిన దాస్యం

**ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్ 26:** బీఆర్ఎస్ పార్టీ 48వ డివిజన్ యువ నాయకుడు పబ్బోజు శ్రీకాంతా చారి పేరిట రూపొందించిన 2026వ సంవత్సరానికి సంబంధించిన నూతన క్యాలెండర్‌ను ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ ఆవిష్కరించారు. బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం రోజున ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు హరినాథ్, నాయకులు శ్రీనాథ్, హబీబ్, శ్రీనివాస్, గిరధర్, నరేష్, పప్పు పటేల్, మహ్మద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.



# కేవల్ కిషన్ సమాధి వద్ద స్మృతి వనం ఏర్పాటు చేయాలి

- వర్ధంతి సభలో సీపీఎం రాష్ట్ర నాయకులు అడివయ్య

**ప్రతిపక్షం,చేగుంట,డిసెంబర్ 26:** పీడిత ప్రజల విముక్తి కోసం అసువులు బాసిన అమరజీవి కామ్రేడ్ కేవల్ కిషన్ అని సిపిఎం రాష్ట్ర నాయకులు అడివయ్య అన్నారు. మెదక్ జిల్లా చేగుంట మండలం పోలంపల్లి చౌరస్తాలో కేవల్ కిషన్ సమాధి వద్ద ఏర్పాటు చేసిన వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బడుగు వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన కేవల్ కిషన్ ను 1960 డిసెంబర్ 26 హత్య చేశారని అడివయ్య పేర్కొన్నారు. ఆయన తల్లి మున్నమ్మ మెదక్ మున్సిపల్ చైర్మన్ గా పని చేశారన్నారు. ఆయన కుమార్తె వీణ కుమారి వైద్య విధాన పరిషత్ చైర్మన్ గా కొనసాగారని అడవయ్య వెల్లడించారు. తన తండ్రి సంపాదించిన ఎక్కువ శాతం భూములను పేదలకు పంచారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కడారి నరసమ్మ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లేశం కార్యవర్గ సభ్యులు సంతోష్ అజయ్ మద్ది లక్ష్మీ నరసయ్య బాలమని లచ్చగౌడ్ నాగరాజు వెంకట్ మల్లేశం షౌకత్ అలీ లక్ష్మి దుర్గా కవిత శ్రీదేవి సిద్ధమ్మ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# అంతరాలు లేని సమసమాజ స్థాపనే ఎర్రజెండా లక్ష్యం


- సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



**ప్రతిపక్షం, గజ్వేల్, డిసెంబర్ 26:** దేశంలో ఎర్రజెండా పట్టిన కమ్యూనిస్టులు లేని పోరాటాలు లేవని, అంతరాలు లేని సమ సమాజ స్థాపనే లక్ష్యంగా పని చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. శుక్రవారం సీపీఐ 101వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని పార్టీ కార్యకర్తలు గజ్వేల్ కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించి ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద సీపీఐ అరుణ పతాకాన్ని మంద పవన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న సిపిఐ పార్టీ కాన్పూర్లో ఆవిర్భావం నుండి నేటి వరకు అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించిన ఘనత ఉందని చట్టసభల్లో కార్మికుల, కర్షకుల విద్యార్థులకు అనేక చట్టాలు చేసినటువంటి ఘనత సిపిఐ పార్టీకి ఉన్నది అన్నారు. అదేవిధంగా దేశ స్వతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాట నిర్వహించి అనేకమంది కమ్యూనిస్టులు వీరమరణం పొంది దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో ప్రధాన పాత్ర పోషించిందని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటలు నిర్వహించి మూడు వేల గ్రామాలను విముక్తి చేసి పది లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు పంచడం జరిగిందని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో సిపిఐ పార్టీ కీలకపాత్ర పోషించి తెలంగాణ సాధించడంలో ముందు వరుసలో ఉందన్నారు. కొంత మంది కమ్యూనిస్టు పార్టీ వ్యతిరేకులు కమ్యూనిస్ట్ పార్టీలు అంతం అయిపోతుందని మాట్లాడుతున్నారని,కానీ ప్రకృతి ఉన్నన్ని రోజులు ఎర్రజెండా ఒరగదన్నారు. సిపిఐ పార్టీకి 100 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వచ్చే నెల జనవరి 18 న ఖమ్మంలో నిర్వహించే శతయంతి ముగింపు ఉత్సవాల భారీ బహిరంగ సభను కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, కర్షకులు, మేధావులు అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బట్టు దయనంద రెడ్డి,జేరిపోతుల జనార్ధన్, గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి శివలింగు కృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం, మండల సహాయ కార్యదర్శి పోచయ్య, బొడ్ల సాయిలు, మొట్ట శ్రీను, చింత శ్రీను, ముట్రాజ్ పలి హమాలి కార్మిక సంఘం నాయకులు, ప్రజ్ఞాపూర్ హమాలి కార్మిక సంఘం నాయకులు, కంకుల కార్మిక సంఘం నాయకులు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు, మిట్టపల్లి సుధాకర్, రామగళ్ల నరేశ్, నాయకులు నర్సింహ రెడ్డి, కానుగుల రామనకర్ మరియు మహిళలు పాల్గొన్నారు.

# బంగ్లాలో భారత్ వ్యతిరేక నిరసనలు

**ఢాకా, డిసెంబర్ 26:** వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగే క్రమంలో విద్యార్థి నేత ఉస్మాన్ హాదీ హత్య తర్వాత ఇటీవల ఢాకాలో ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితులు ఇంకా చల్లారడం లేదు. తాజాగా శుక్రవారం నాడు ప్రార్థనల అనంతరం పలువురు భారత వ్యతిరేక నినాదాలు చేస్తూ ఢాకా యూనివర్సిటీలో ప్రదర్శన నిర్వహించారు. ఇటీవల హత్యకు గురైన యువ నేత ఉస్మాన్ హాదీ మద్దతుదారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో 'నేను హాదీని' అని నినాదాలు చేస్తూ, త్వరగా విచారణ జరిపి ఉస్మాన్ హంతకులను ఉరి తీయాలని డిమాండ్ చేశారు. కాగా, హాదీ హంతకులు చట్టం నుంచి తప్పించుకోవడానికి బంగ్లాదేశ్ సరిహద్దు దాటారని ఒక వర్గం నిరసనకారులు ఆరోపిస్తున్నారు. హంతకులను అరెస్ట్ చేయడానికి ఢాకా.. భారతదేశం సహాయం కోరింది. కానీ రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణించడంతో న్యూఢిల్లీ ఆ ఆరోపణలను తీవ్రంగా తిరస్కరించిందని వారు పేర్కొన్నారు.



## విశ్వ వీక్షణం



# 20 మంది బాలలకు పీఎం రాష్ట్రీయ పురస్కారాలు

- అవార్డు గ్రహీతల్లో క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 26:** వివిధ రంగాల్లో ప్రతిభ చూపించిన పిల్లలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారా'లను బహూకరించారు. ధైర్యసాహసాలు, సామాజిక సేవలు, పర్యావరణం, క్రీడలు, కళలుసంస్కృతి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అసాధారణ విజయాలను సాధించినందుకు వీటిని అందజేశారు. వీర్ బాల్ దివస్‌ను పురస్కరించుకొని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో 18 రాష్ట్రాలకు చెందిన 20 మంది పిల్లలకు వీటిని ప్రదానం చేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో తెలంగాణలోని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన 16 ఏళ్ల పర్వతరోహకుడు విశ్వనాథ్ కార్తికేయ్, ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాకు చెందిన 17 ఏళ్ల పారా అథ్లెట్ క్రీడాకారిణి శివాని హోసూరు ఉప్పర ఉన్నారు. రికార్డులు సృష్టిస్తున్న క్రికెట్ క్రీడాకారుడు వైభవ్ సూర్యవంశీ కూడా పురస్కారం అందుకున్నాడు.

**విశ్వనాథ్ పేరిట 4 ప్రపంచ రికార్డులు**

తెలంగాణలోని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన 16 ఏళ్ల పడకంటి విశ్వనాథ్ కార్తికేయ్ పర్వతరోహకుడు. ఈ ఏడాది ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించడం ద్వారా 'సెవెన్ సమ్మిట్స్' ఛాలెంజ్‌ను పూర్తి చేసిన అతి పిన్న వయస్కుడైన భారతీయుడిగా నిలిచాడు. విశ్వనాథ్ పేరిట నాలుగు ప్రపంచ రికార్డులు ఉన్నాయి. అందులో ఎల్‌బ్రాస్ పర్వతాన్ని కేవలం 24 గంటల్లోనే ధిరోహించిన అతిపిన్న వయస్కుడిగా రికార్డు కూడా ఒకటి. విశ్వనాథ్ ఆరు ఖండాల్లోని 20కి పైగా పర్వతాలను అధిరోహించాడు.



# స్కూళ్లలో ఇకపై పత్రికలు చదవడం తప్పనిసరి

- ఉత్తర్వులు జారీ చేసిన యూపీ ప్రభుత్వం

**ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 26:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇకపై పత్రికలను తప్పనిసరిగా చదవాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నేటి తరం విద్యార్థులు ఎక్కువ కాలం మొబైల్, కంప్యూటర్లతో గడుపుతున్న క్రమంలో వారి స్క్రీన్ టైమింగ్‌ను తగ్గించి వారిలో పఠనాసక్తిని పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రాథమిక, విద్యార్థులు తప్పనిసరిగా పత్రికలను చదవాలని ఆదేశించిన ప్రభుత్వం, ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేసింది. దీని కోసం పాఠశాల లైబ్రరీలో హిందీ, ఇంగ్లిష్ పేపర్లు విద్యార్థులకు అందుబాటులో ఉంటాయి. నిర్దేశిత సమయంలో వెళ్లి పత్రికల్లోని ఎడిటోరియల్, జాతీయ, అంతర్జాతీయ, క్రీడా వార్తలను విద్యార్థులు రొటేషన్ విధానంలో చదవాల్సి ఉంటుంది. అదే సమయంలో 'వర్డ్ ఆఫ్ ద డే' ఎక్సర్‌సైజ్‌ను కూడా నిర్వహిస్తారు. ఆ రోజు పత్రికల్లోని ఐదు కష్టమైన పదాలను ఎంపిక చేసి వాటిని నోటీస్‌బోర్డ్‌పై రాస్తారు. దీని ద్వారా విద్యార్థుల్లో పదజాలంపై పట్టు పెరుగుతుంది. పత్రికలు చదవడం ద్వారా విద్యార్థుల్లో జీకే, పదజాలం, విమర్శనాత్మక ఆలోచన, ఏకాగ్రత, సామాజిక చైతన్యం పెరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

# పద్మ అవార్డులు బిరుదులు కాదు

- వాటిని పేర్ల ముందు, వెనక ఉపయోగించరాదు
- స్పష్టం చేసిన బాంబే హైకోర్టు

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, ముంబై, డిసెంబర్ 26:** పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మ విభూషణ్, భారత రత్న వంటి పౌర పురస్కారాలు అధికారిక బిరుదులు కావని, వాటిని ఎవరూ తమ పేర్ల ముందు కాని, వెనుక కాని ఉపయోగించరాదని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. 2004లో పద్మ అవార్డును స్వీకరించిన శరద్ మోరేశ్వర్ హర్దీకర్ తన పిటిషన్‌లో తన పేరు ముందు పద్మశ్రీ అని రాసుకోవడంపై బాంబే హైకోర్టు బుధవారం విచారణ సందర్భంగా అభ్యంతరం తెలిపింది. పౌర అవార్డులను తమ పేర్ల ముందు రాసుకోవడం చట్టపరంగా తప్పని జస్టిస్ సోమశేఖర్ సుందరేశన్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టంచేసింది. ఈ సందర్భంగా 1995లో సుప్రీంకోర్టుకు చెందిన రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును హైకోర్టు ప్రస్తావించింది




## సెంగార్‌కు బెయిలును నిరసిస్తూ
# వెల్లువెత్తిన నిరసనలు

**ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 26:** ఉన్నావ్ రేప్ కేసులో దోషిగా జీవిత ఖైదును అనుభవిస్తున్న బీజేపీ మాజీ ఎమ్మెల్యే కుల్దీప్ సింగ్ సెంగార్ జైలు శిక్షను నిలిపివేస్తూ ఇచ్చిన తీర్పున కు వ్యతిరేకంగా ఢిల్లీ హైకోర్టు వెలుపల శుక్రవారం నిరసనలు వెల్లువెత్తాయి. రేపిస్టులకు రక్షణలు కల్పించడాన్ని ఖండిస్తూ ప్లకార్డులు, నినాదాలతో కోర్టు ప్రాంగణం సమీపంలో నిరసనకారులు ప్రదర్శనలు నిర్వహించారు. ఉన్నావ్ అత్యాచార బాధితురాలికి మద్దతుగా నిర్వహించిన ఈ నిరసన ప్రదర్శనలలో ఐద్వాకు చెందిన సభ్యులతోపాటు సామాజిక కార్యకర్త యోగితా భావన, బాధితురాలి తల్లి తదితరులు పాల్గొన్నారు. తన కుమార్తె చాలా కష్టాలను ఎదుర్కొందని, ఇప్పుడు కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకించడానికే తాను వచ్చానని బాధితురాలి తల్లి మీడియాకు తెలిపారు. తాను న్యాయవ్యవస్థను మొత్తంగా విమర్శించడం లేదని, ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులు న్యాయవ్యవస్థపై తమ కుటుంబం పెట్టుకున్న నమ్మకాన్ని దెబ్బతీశాయని ఆమె చెప్పారు. గతంలో దిగువ కోర్టు ఇచ్చిన తీర్పు తమ కుటుంబానికి న్యాయం చేయగా దోషికి బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు ఇచ్చిన తీర్పు తమకు అన్యాయం చేసిందని ఆమె అన్నారు. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేస్తామని, అత్యున్నత న్యాయస్థానంపై తమకు విశ్వాసం ఉందని ఆమె తెలిపారు.







# మెతుకు సీమ విప్లవ ఉద్యమంలో వెలిసిన ధృవతార కామ్రేడ్ కేవల్ కిషన్



**కార్మిక కర్షక జీవితాలలో వెలుగుల నింపిన విప్లవోద్యమ నేత కామ్రేడ్ కేవల్ కిషన్ తెలంగాణ సాయుధ రైతన్న పోరాటా స్ఫూర్తిని వారసత్వంగా తీసుకొని మెదక్ జిల్లాలో విప్లవ ఉద్యమాన్ని నిర్మించడం కోసం సాయి శక్తుల కృషిచేసిన మెతుకు సీమ విప్లవోద్యమ ధ్రువతార కామ్రేడ్ కేవల్ కిషన్ వర్ధంతి సందర్భంగా ప్రతిపక్షం ప్రతినిధి అందిస్తున్న ప్రత్యేక కథనం...**

**బొందుగుల నాగరాజు**
**ప్రతిపక్షం ప్రతినిధి మెదక్**

మెదక్ జిల్లా చిన్నశంకరంపేట్ మండలం తుర్కల మందాపూర్ గ్రామంలో కేవల్ నారాయణ, మున్నా బాయి దంపతులకు రెండవ కుమారుడు 1922 మే 10న కేవల్ కిషన్ జన్మించారు. మారుమూల ప్రాంతంలో పుట్టిన కేవల్ కిషన్ ఉన్నత చదువు కోసం నిజాం కాలేజీలో బీఏ చదువుతున్న క్రమంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ చేస్తున్న తెలంగాణ సాయుధ పోరాట నీ చదివి ఆస్ఫూర్తితో మెదక్ జిల్లాలో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పట్టుదలతో స్వగ్రామానికి చేరుకున్నాడు ఆ క్రమంలో ప్రభుత్వ ఉద్యోగం వస్తే ఉద్యోగాన్ని నిరాకరించి ప్రజల కోసం పనిచేయాలని ప్రజలు పడుతున్న బాధలను ండి విముక్తి కల్పించాలని ఉద్దేశంతో మెదక్ రామాయంపేట పరిసరాల ప్రాంతాలలో ఎర్ర జెండా పట్టుకొని తిరిగాడు మొదటగా తన ఇంటి నుండి ప్రారంభించాడు తండ్రి కేవల్ నారాయణ పట్వారి కావడంతో గ్రామంలో తన తండ్రి వద్దకు వచ్చి ఇనామిస్తే వ్యతిరేకించేవాడు. గొర్ల కాపరులు ప్రతి పండుకు మేకను గొర్రెను ఇస్తే వద్దనే వాడు. చివరికి కల్లుగీత కార్మికులు కల్లుని ఇస్తే కూడా దాన్ని నిరాకరించేవాడు ఏది పట్వారిలకు ఎక్కడ ఉచితంగా ఇవ్వరాదని గ్రామస్తులతో చర్చించేవాడు దీంతో తండ్రికి సైతం కోపం పెరిగింది. కమ్యూనిస్టు పార్టీగా పూర్తి కాలం కార్యకర్తగా పనిచేయడం కోసం ఇంటి నుండి బయటకు వచ్చాడు. 1922 సంవత్సరంలోనే ఉమ్మడి మెదక్ జిల్లాలో మాడపాటి హనుమంతరావు నేతృత్వంలో గ్రంథాలయ ఉద్యమం ప్రారంభమైంది.ఈ స్ఫూర్తితోనే ఆంధ్ర మహాసభ ఏర్పడి 1930 మార్చి నెలలో జోగిపేట పట్టణంలో మూడు రోజులపాటు మొదటి మహాసభ జరిగింది.చారిత్రాత్మకమైన వీర తెలంగాణ సాయుధ రైతంగా పోరాటానికి ఈ ఆంధ్ర మహాసభ పోరాటాలు స్ఫూర్తినిచ్చాయి. మెదక్ జిల్లాలో పెట్టిచాకిరి ,కుల వివక్షత,అంటరానితనం, స్త్రీలపై వేధింపులు,భాషా సాంస్కృతి అణచివేతలు కొనసాగినవి. ఆంధ్ర మహాసభ ఇచ్చిన స్ఫూర్తితో ఈ సామాజి,క ఆర్థిక అణచివేతలకు వ్యతిరేకంగా మెదక్ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో పోరాటాలు జరిగాయి. తెలంగాణ సాయుధ పోరాటం స్ఫూర్తితో జిల్లాలో ప్రజల సమస్యలపై అనేక పోరాటాలు జరిగాయి.మెదక్ ప్రాంతం నుండి ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వెళ్ళిన అనేకమంది విద్యార్థులలో ఒక్కరైనా కేవల్ కిషన్ పై తెలంగాణ రైతంగా సాయుధ పోరాటం, కమ్యూనిస్ట్ పార్టీ ప్రభావం పడింది. మెదక్ ప్రజలను విముక్తి చేసేందుకు కేవల్ కిషన్ మెదక్ ప్రాంతానికి తిరిగివచ్చి కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో భూస్వాములకు వ్యతిరేకంగా, సామాజిక వివక్షతపై, ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకువచ్చి పోరాటాలు నిర్వహించారు.భూమి లేని పేదలకు ప్రభుత్వ భూములు పంచాలని నిరుపేద ప్రజలను సమీకరించి చేసిన భూపోరాటాలు నైజాం నవాబ్ ల గుండెల్లో రైళ్లు పరుగెత్తించారు.కమ్యూనిస్టు పార్టీని నిషేధించిన కాలంలో రైతుల వద్దనే పడుకునేవాడు ముఖ్యంగా అడవి ప్రాంతంలో గల కోమటూర్.రాజ్ పల్లి. ఖ్ జిపల్లి వెంకటాపూర్. ఏరియాలో జొన్న చేనుల మంచెల కాడ రాత్రిలో పండుకునేవాడని ఒక వద్ద కాకుండా స్థలాన్ని మార్చి పడుకోవడం జరిగిందని అప్పటి వృద్ధులు ఇప్పటికీ జ్ఞాపకం చేసుకుంటారు. అనంతరం కమ్యూనిస్టు పార్టీ ఎన్నికలలో పోటీ చేస్తే రెండుసార్లు కామ్రేడ్ కేవల్ కిషన్ ఓడిపోవడం జరిగింది. అప్పట్లో హత్నూర బ్లాక్ నుండి కౌడిపల్లి బ్లాక్ (సర్పంచ్ ) చిలుముల విట్టల్ రెడ్డి. కౌడిపల్లి మండలం వెల్మకన్య బ్లాక్ (సర్పంచ్)గా శివకాశం గెలుపొంది ప్రజల కోసం పనిచేస్తున్న క్రమంలో రెండుసార్లు ఓడిపోయిన కేవల్ కిషన్ గ్రామాలలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణాన్ని చేపట్టారు. ఆ క్రమంలో ఘనపూర్ మండలం జక్కన్నపేట చెరువు గండిపడి పొలాలన్నీ కొట్టుకపోవడం జరిగింది . దీంతో రైతులను ఐక్యతపరచి ఆ రోజులలో 20 ట్రాక్టర్ల ద్వారా చెరువు కట్ట నిర్మాణాన్ని కొనసాగించాడు. దీంతో ప్రభుత్వం దిగివచ్చి చెరువు కట్ట నిర్మాణం నువ్వు చేయవద్దని అడ్డుకోవడం పోలీసులు రావడంతో ప్రభుత్వం చేయాల్సిన పని రైతులు స్వచ్ఛందంగా చేసుకుంటే మీకేమిటని గట్టిగా కొట్లాడి చంపితే నన్ను ముందు చంపండి అని ప్రభుత్వానికి సవాలు విసరడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. దీంతో కామ్రేడ్ కేవల్ కిషన్ కు ప్రజలలో మరింత పట్టు దొరికింది. మెదక్ పట్టణంలోని దుబ్బ తోటలో సుమారు 400 ఎకరాలను పట్టణంలోని పేద ప్రజలకు పంచడంలో ఆ భూమిని ఆక్రమించుకొని ఎర్రజెండాలు పాతి పట్టాలి ఇచ్చేవరకు పెద్ద ఎత్తున పోరాటం నిర్వహించారు అధికారులతో మాట్లాడి పట్టాలు పేద ప్రజలకు ఇవ్వడంలో కేవన్ ముందున్నాడు. కేవల్ కిషన్ మరణానంతరం ఆయన స్ఫూర్తితో మెదక్ జిల్లా కేంద్రంలోని గాంధీ నగర్ వద్ద కేవల్ కిషన్ నగర్ ఏర్పాటు చేసి సుమారు 140 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగింది అక్కడ కేవల్ కిషన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగింది అప్పటి విగ్రహాన్ని ప్రారంభించడం కోసం అప్పటి సిపిఎంఎల్ జనశక్తి బలపర్చిన అభ్యర్థి సిరిసిల్లా ఎమ్మెల్యే ఎన్ వి కృష్ణయ్య. సిపిఐ నేత విట్టల్ రెడ్డి.రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి కార్యదర్శి దుడయాదేశ్వర్. లక్ష్మణ్. బొందుగుల ఉషయ్య తదితరులు పాల్గొన్నారు...

### తమ కోసం పనిచేసే దేవుడిగా భావిస్తున్న ప్రజలు

పేద ప్రజల హక్కుల కోసం పోరాట మార్గాన్ని ఎంచుకుని మెదక్ ప్రాంత ప్రజలకు చైతన్య దీపిక అయ్యారు. 1960 సంవత్సరంలో అప్పుడే స్థానిక ఎన్నికలు రావడం స్థానిక ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ తరఫున అభ్యర్థులను నిలబెట్టడంలో నిరంతర పని ఒత్తిడి పెరిగింది. రామాయంపేట మెదక్ ప్రాంతంలో స్థానిక ఎన్నికలలో కమ్యూనిస్టు పార్టీ విజయం సాధిస్తే కేవల్ కిషన్. ప్రజలలో రగిలించిన ఉద్యమ స్ఫూర్తి బలపడుతుందని అప్పటి కాంగ్రెస్ సంబంధించిన ఒక సామాజిక వర్గం మొత్తం ఒకటే 1960 డిసెంబర్ 26న చేగుంట మండలం పొలంపల్లి దగ్గర రోడ్ యాక్సిడెంట్ చేసి చంపేశారు. దేనితో ప్రజలంతా ఒకటై ఎక్కడైతే రోడ్డు యాక్సిడెంట్ లో చంపేశారు అక్కడనే సమాధి చేసి ప్రతి సంవత్సరం చుట్టుపక్కల గ్రామస్తులందరూ పెద్ద ఎత్తున జాతర చేస్తూ బండ్లు కడుతూ సమాధి చుట్టూ తిప్పుతూ ఆయనను జ్ఞాపకం చేసుకుంటారు. ప్రజల కోసం పనిచేసే ఒక మనిషిని చంపడంతో అప్పటినుండి నేటి వరకు అయినను దేవుడుగా కొలుస్తారు. భూస్వాములు, గ్రామీణ ప్రాంతంలోని పెత్తందారులు కేవల్ కిషన్ ను భౌతికంగా హత్య చేసినప్పటికి ప్రజలలో నేటికీ కేవల్ కిషన్ ఆశయాలు బ్రతికే ఉన్నాయి. ప్రజల మదిలో కేవల్ కిషన్ నేటికీ జీవించి ఉన్నారు.ప్రజలకోసం జీవితాంతం బ్రతకడమే కాకుండా పేద ప్రజలకు తన ఆస్థిని పంచిన విప్లవోద్యమా నేత కేవల్ కిషన్.

### కేవల్ కిషన్ పోరాటస్ఫూర్తిని కొనసాగిస్తాం

**సీపీఎం నాయకులు. ఏ.మల్లేశం .**

ఉమ్మడి మెదక్ జిల్లాలో కామ్రేడ్ కేవల్ కిషన్ ఆశయాలను సాధించేందుకు సీపీఎం కృషి చేస్తుంది. సిపిఎం నేత ఏ మల్లేశం తెలిపారు ఆయన ఆశయాలను ఆచరణలో పెడుతూ సంగారెడ్డి, మెదక్ జిల్లా కేంద్రాల్లో కేవల్ కిషన్ పేరుతో సిపిఎం కార్యాలయాలను ఏర్పాటు చేసి ప్రజా పోరాటాలకు కేంద్రాలుగా నిలుస్తున్నవి. మెదక్ పట్టణంలోని కేవల్ కిషన్ భవన్ కరోనా మహమ్మారి సమయంలో హోమ్ క్వారంటైన్ సెంటర్ ఏర్పాటు చేసి కరోనా బాధితులకు అన్నితమై సేవలు అందించింది.గత సంవత్సరం కాలం నుండి పేద పిల్లలకు ఉచిత ట్యూషన్ సెంటర్ నడుపుతున్నది. మెదక్ జిల్లా కేంద్రంలో జరిగే అనేక ప్రజాపోరాటాల రూపకల్పనకు కేవల్ కిషన్ భవన్ వేదిక అవుతుంది.కేవల్ కిషన్ మరణించి 65 ఏండ్లు గడుస్తున్నా నేటికీ మెదక్ జిల్లా ప్రజల గుండెల్లో చేరగని ముద్ర వేసుకున్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 26నాడు అయన వర్ధంతి సందర్భంగా ఆయన్ను స్మరించుకోవడానికి పొలంపల్లి గ్రామ శివారులోని కేవల్ కిషన్ సమాధి. సంస్మరణ సభ ఏర్పాటు చేయడం జరుగుతుందని అలాగే మెదక్ పట్టణంలో తో పాటు జక్కన్నపేట గ్రామంలో ఆయన విగ్రహాల వద్ద నివాళులర్పించి ఆయన స్ఫూర్తిని నేటి యువతకు అందించే విధంగా కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు ఆయన స్ఫూర్తితో మెదక్ జిల్లాలో ఎన్నో ఉద్యమాలు చేయడం జరుగుతుందని వారు అన్నారు ముఖ్యంగా నేడు కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా మరియు ఉపాధి హామీ పథకంలో భారీ మార్పులు చేసి కొత్త చట్టం ద్వారా ఉపాధి హామీ పథకాన్ని తీసివేయడం కోసం చేస్తున్న కుట్రను ప్రజలకు వివరించి పోరాడుతామన్నారు ఏది ఏమైనప్పటికీ మెతుకు సీమ విప్లవద్యమ చరిత్రలో కామ్రేడ్ కేవల్ కిషన్ ఉద్యమ స్ఫూర్తి విడదీయరానిది......

### నివాళులర్పించిన సర్పంచ్

జక్కన్నపేట గ్రామంలో నిరంతర ప్రజల కోసం పని చేస్తూ యాక్సిడెంట్ రూపంలో మృతి చెందిన ప్రజల మనిషి కామ్రేడ్ కేవల్ కిషన్ విగ్రహానికి జక్కన్నపేట గ్రామ సర్పంచ్ చామంతుల సత్యనారాయణ వార్డ్ మెంబర్లు ప్రజలు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.










## కోహ్లీ ఖాతాలో మరో రికార్డు

వన్డే ఫార్మాట్లో రారాజుగా వెలుగొందుతున్న విరాట్ కోహ్లీ వరుసగా రికార్డులను బ్రేక్ చేస్తున్నాడు. సిడ్నీ వన్డేలో అర్ధ శతకంతో మొదలైన విరాట్ పరుగుల ప్రవాహం అవిఘ్నంగా కొనసాగుతోంది. బీసీసీఐ కోరిక మేరకు విజయ్ హజారే ట్రోఫీ లోనూ ఆడుతున్న కింగ్ కోహ్లీ.. అక్కడా రికార్డుల దుమ్ముదులుపుతున్నాడు. తొలి మ్యాచ్‌లోనే శతకంతో రెచ్చిపోయిన భారత స్టార్.. గుజరాత్‌పై అర్ధ శతకంతో మరో రికార్డు పట్టేశాడు. లిస్ట్ - ఏ క్రికెట్ లో అత్యధిక సగటు నమోదు చేశాడు. ఇటీవల కాలంలో సూపర్ ఫామ్ కొనసాగిస్తున్న కోహ్లీ విజయ్ హజారే ట్రోఫీతో తడాఖా చూపిస్తున్నాడు. వచ్చే ప్రపంచకప్ లక్ష్యంగా పదిహేనేళ్ల తర్వాత ఈ లీగ్ లో ఆడుతున్న అతడు.. విధ్వంసక ఆటతో అందర్నీ ఫిదా చేస్తున్నాడు. శుక్రవారం గుజరాత్‌పై హాఫ్ సెంచరీతో కదం తొక్కిన విరాట్ మళ్లీ వంద కొట్టేలా కనిపించాడు. కానీ, 77 పరుగుల వద్ద వెనుదిరిగాడు. అయినా సరే.. అత్యధిక సగటుతో ఆస్ట్రేలియా మాజీ ఫినిషర్ మైఖేల్ బెవాన్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును దాటేశాడు. 'నాటౌట్ కింగ్'గా పేరొందిన బెవాన్ సగటు లిస్ట్ ఏ క్రికెట్ లో 57.86 కాగా.. కోహ్లీ 57.87తో అతడిని అధిగమించాడు. లిస్ట్ ఏలో సచిన్ టెండూల్కర్ రికార్డును బద్దలు కొడుతూ అత్యల్ప మ్యాచుల్లోనే 16 వేల క్లబ్‌లో చేరాడు విరాట్. ప్రస్తుతం 343 మ్యాచుల్లో 57.60 సగటుతో 16,130 రన్స్ బాదాడు. ఇందులో 58 సెంచరీలు, 84 అర్ధ శతకాలు ఉన్నాయి.





## షఫాలీ పరుగుల సునామీ

**• సిరీస్ గెలిచిన టీమిండియా**

వరల్డ్ ఛాంపియన్ భారత జట్టు స్వదేశంలో తొలి సిరీస్ పట్టేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ(79 నాటౌట్) విధ్వంసక అర్ధ శతకంతో చెలరేగగా.. మూడో టీ20లోనూ భారీ విజయంతో సిరీస్ పట్టేసింది. ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఆతిథ్య జట్టుకు కనీస పోటీ ఇవ్వలేకపోతున్న లంక త్రివేండ్రంలోనూ చతికిలపడింది. రేణుకా సింగ్(421)తో నిప్పులు చెరగగా.. స్వల్ప ఛేదనలో షఫాలీ ఉప్పెనలా విరుచుకుపడింది. అంతే.. 13.2 ఓవర్లలోనే విక్టరీ కొట్టిన భారత్.. మరో రెండు మ్యాచ్‌లుండగానే సిరీస్ పట్టేసింది. స్వదేశంలో ఇటీవలే వన్డే ప్రపంచకప్‌తో చరిత్ర సృష్టించిన హర్మన్‌ప్రీత్ బృందం.. పొట్టి సిరీస్‌ను కైవసం చేసుకుంది. త్రివేండ్రంలో శుక్రవారం శ్రీలంకను 112కే కట్టడి చేసిన టీమిండియా.. స్వల్ప లక్ష్యాన్ని ఉఫ్‌మనిపించింది. ఓపెనర్ షఫాలీ వర్మ(79 నాటౌట్) సుడిగాలిలా చెలరేగి బౌండరీల మోతతో లక్ష్యాన్ని మంచులా కరిగించింది. స్మృతి మంధాన(1), జెమీమా రోడ్రిగ్స్(9)లు విఫలమైనా.. దూకుడే మంత్రగా ఆడిన లేడీ సెహ్వాగ్ 24 బంతుల్లోనే సెంచరీ కొట్టింది. హాఫ్ సెంచరీ తర్వాత కూడా అదే దూకుడు కనబరిచింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(21 నాటౌట్)తో కలిసి జట్టుకు భారీ విజయాన్ని అందించింది. ఈ గెలుపుతో టీ20ల్లో అత్యధిక విజయాలతో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మేగ్ లానింగ్ పేరిట ఉన్న రికార్డును హర్మన్‌ప్రీత్ బ్రేక్ చేసింది. 77 విజయాలతో లానింగ్‌ను ఇండియన్ స్కిప్పర్ వెనక్కి నెట్టేసింది. వరుసగా రెండు మ్యాచుల్లో ఓడిన శ్రీలంక చావోరేవో పోరులోనూ చిన్న స్కోర్‌కే పరిమితమైంది. టాస్ ఓడిన ఆ జట్టు ఇన్నింగ్స్‌ను దూకుడుగానే ఆరంభించింది. ఓపెనర్ హాసిని పెరీరా(హాసిని పెరీరా(25) బౌండరీలతో చెలేరగడంతో స్కోర్ దాటింది. అయితే.. దీప్తి శర్మ(318) ఓవర్లో చమరి ఆటపట్టు(3)ను ఔట్ చేసి దీప్తి శర్మ తొలి బ్రేకిచ్చింది. ఆ తర్వాత ఆరో ఓవర్లో రేణుకా సింగ్(421) పెరారీతో పాటు డేంజరస్ హర్షిత సమరవిక్రమ(2)లను వెనక్కి పంపింది. దాంతో.. 32కే లంక మూడు బిగ్ వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో కూరుకుపోయింది. కీలక బ్యాటర్లు ఔట్ కావడంతో కష్టాల్లో పడిన లంకను ఇమేశా దులానీ (27) ఆదుకుంది. అయితే.. ఆమెతో కలిసి భాగస్వామ్యంతో జట్టును ఆదుకోవాలనుకున్న నీలాక్షి డిసిల్వా(4)ని రేణుక ఎల్బీగా పెవిలియన్ చేర్చింది. దాంతో.. 10 ఓవర్లకు లంక స్కోర్. 454. క్రాంతి గౌడ్, దీప్తి ఓవర్లో ఫ్రంట్ ఫుట్ లో..._స్వీప్ షాట్లతో విరుచుకుపడిన దులానీ.. కవిశ దిల్హరి(20) తో కలిసి స్కోర్ బోర్డును ఉరికించింది. 26 బంతుల్లో 40 రన్స్ పిండుకున్న ఈ ద్వయాన్ని దీప్తి విడదీసింది. సిక్సర్‌కు యత్నించిన దిల్హారి బౌండరీ వద్ద అమన్‌జోత్ చేతికి చిక్కడంతో 85 వద్ద ఐదో వికెట్ పడింది. కాసేపటికే దులానీని రేణుక వెనక్కి పంపగా లంక స్కోర్ నెమ్మదించింది. ఆఖర్లో కుశాని నుత్యంగన(19 నాటౌట్) మెరుపులతో ఆటపట్టు బృందం నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 112 రన్స్ చేయగలిగింది.




## మనోళ్లతో ఆట అంత ఈజీ కాదు

ఇటీవల కాలంలో భారత కుర్రాళ్లు చదరంగంలో అబ్బురపరిచే విజయాలతో ఔరా అనిపిస్తున్నారు. వేదిక ఏదైనా తమదైన ప్రతిభతో మేటి ఆటగాళ్లను సైతం ఓడిస్తున్నారు. వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్ సైతం అమ్మో భారత కుర్రాళ్లతో తలపడడం కష్టమేనని అంటున్నాడు. ఫిడే వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌ను పురస్కరించుకొని మాట్లాడిన ఈ నార్వే లెజెండ్ మాజీ ఛాంపియన్ డి.గుకేశ్తో ఆడడం ఎల్లప్పుడూ సవాల్‌గానే ఉంటుందని అన్నాడు. దోహాలోని ఖతార్‌లో జరుగుతున్న ఫిడే వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌లో కార్ల్‌సన్ ఫేవరెట్‌గా ఆడుతున్నాడు. ఈ టోర్నీలో జూనియర్ల నుంచి తనకు గట్టి పోటీ ఎదురుకానుందని చెబుతున్న అతడు భారత కుర్రాడు గుకేశ్‌తో ముప్పేనని అంటున్నాడు. గత కొన్ని రోజులుగా నేను యంగ్‌స్టర్స్‌తో మ్యాచ్‌లు ఆడలేదు. వారు ఈ మధ్య చాలా గొప్పగా ఆడుతున్నారు. ముఖ్యంగా డి.గుకేశ్ అదరగొడుతున్నాడు. 16 నుంచి 22 ఏళ్లున్న యువకెరటాలతో ప్రమాదం పొంచి ఉంటుంది అని కార్ల్‌సన్ తెలిపాడు. ఈ ఏడాది నార్వే చెస్ లో గుకేశ్ వ్యూహాలకు బదులివ్వలేక కార్ల్‌సన్ చేతులెత్తేశాడు. వరల్డ్ నంబర్ 1ను ఓడించి వార్తల్లో నిలిచాడు భారత గ్రాండ్‌మాస్టర్. అయినా సరే గుకేశ్‌ను తాను గ్రేట్ ప్లేయర్‌గా కాకుండా యంగ్‌స్టర్‌గానే చూస్తానని అంటున్నాడీ చెస్ కింగ్. ఈ మధ్య స్వదేశంలో ముగిసిన చెస్ వరల్డ్‌కప్‌లో నిరాశపరిచిన గుకేశ్ .. ఫిడే వరల్డ్ ర్యాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌లో కార్ల్‌సన్‌కు చెక్ పెట్టాలనే పట్టుదలతో ఉన్నాడు. అతడితో పాటు అర్జున్ ఎరిగేసి, ప్రజ్ఞానంద.. కోనేరు హంపి, ద్రోణవల్లి హారికలు సత్తా చాటాలనుకుంటున్నారు. ఈ టోర్నీ డిసెంబర్ 26 నుంచి డిసెంబర్ 30 వరకు జరుగనుంది.



## మెగా విక్టరీ మాస్ సాంగ్


### డిసెంబర్ 30న రిలీజ్

మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేశ్ కలిసి నటిస్తున్న క్రేజీ ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు' పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న మ్యాసీవ్ అప్‌డేట్ ఇప్పుడు వచ్చేసింది. ఈ చిత్రంలోని థర్డ్ సింగిల్ 'మెగా విక్టరీ మాస్ సాంగ్' ను డిసెంబర్ 30న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దీనికి సంబంధించిన ప్రోమోను శనివారం రిలీజ్ చేయనున్నారు. సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ అదిరిపోయింది. ఎనర్జీతో నిండిన ఈ పోస్టర్‌లో మెగాస్టార్ చిరంజీవి, విక్టరీ వెంకటేశ్ ఇద్దరూ స్టైలిష్ డాన్స్ పోజుల్లో అదరగొట్టారు. బ్యాక్‌గ్రౌండ్‌లో డ్యాన్సర్లతో కలిసి పూర్తి సెలబ్రేషన్ వైబ్స్‌ను క్రియేట్ చేశారు. డెనిమ్ లుక్, సన్‌గ్లాసెస్‌తో చిరంజీవి మెగా స్వాగ్ తో కనిపిస్తే, రెడ్ జాకెట్ లో వెంకటేశ్ స్టన్నింగ్‌గా కనిపిస్తున్నారు. ఇద్దరి మాస్ అప్పీల్, స్వాగ్ పీక్స్‌లో ఉన్నాయి. ఈ సాంగ్ బిగ్గెస్ట్ సెలబ్రేషన్ ఆంథమ్ గా మ్యూజిక్ చార్ట్స్‌ను షేక్ చేయబోతుంది. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌ని గ్రాండ్ గా స్టార్ట్ చేయడానికి ఇది పర్ఫెక్ట్ సాంగ్.

## 'శ్రీనివాస మంగాపురం' మొదటి షెడ్యూల్ పూర్తి



సూపర్ స్టార్ కృష్ణ మనవడు, దివంగత రమేష్ బాబు కుమారుడు, సూపర్ స్టార్ మహేష్ బాబు అన్న కొడుకు జయ కృష్ణ ఘట్టమనేని రస్టిక్ ఇంటెన్స్ లవ్ స్టోరీ 'శ్రీనివాస మంగాపురం' తో హీరోగా లాంచ్ అవుతున్నారు. విజనరీ ఫిల్మ్ మేకర్ అజయ్ భూపతి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను వైజయంతి మూవీస్ అశ్విని దత్ సమర్పిస్తున్నారు. చందమామ కథలు బ్యానర్‌పై పి. కిరణ్ నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టైటిల్ పోస్టర్‌కు అన్ని వర్గాల నుండి అద్భుతమైన స్పందన లభించింది. టైటిల్ ట్రేడ్ వర్గాలలో, ప్రేక్షకులలో భారీ బజ్‌ను సృష్టించింది. చిత్ర బృందం ఇప్పుడు 30 రోజుల పాటు సాగిన మొదటి షెడ్యూల్‌ను పూర్తి చేసింది. ఈ షెడ్యూల్‌లో 30% చిత్రీకరణ పూర్తయింది. ఇప్పటివరకు వచ్చిన అవుట్‌పుట్‌తో చిత్ర బృందం చాలా హ్యాపీగా ఉంది. ఈ షెడ్యూల్‌లో చిత్ర బృందం మధ్యప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో కీలక సన్నివేశాలు, అద్భుతమైన పాటలు, ముఖ్యమైన టాకీ పార్ట్‌ను చిత్రీకరించింది. పూర్తి ఉత్సాహంతో వున్న చిత్ర బృందం త్వరలో ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేయడానికి సిద్ధమవుతోంది.



## ఛాంపియన్ మా అందరికీ చాలా స్పెషల్


**సక్సెస్ మీట్ లో హీరో రోషన్**

స్వప్న సినిమాస్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ 'ఛాంపియన్'. ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషించారు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్ సమర్పణ లో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌తో కలిసి నిర్మించారు. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ అందుకొని సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ పీపుల్స్ ఛాంపియన్ సక్సెస్ మీట్ నిర్వహించారు. పీపుల్స్ ఛాంపియన్ సక్సెస్ మీట్ లో హీరో రోషన్ మాట్లాడుతూ.. "ఛాంపియన్ సినిమా నాకు చాలా స్పెషల్. ఈ ప్రాజెక్టుకి నేను ఎమోషనల్ అటాచ్ అయ్యాను. స్వప్న అక్క నాకు ఎంతగానో సపోర్ట్ చేసింది. తనకి సినిమా అంటే చాలా పాషన్ సినిమా కోసం ఏమైనా చేస్తుంది. కిరణ్ గారికి థాంక్యూ, అలాగే జీకే గారికి, మా నిర్మాతలు అందరికీ థాంక్యూ సో మచ్. కళ్యాణ్ చక్రవర్తి గారితో నటించడం ఒక గౌరవంగా భావిస్తున్నాను. ఇప్పటినుంచి ఆయన నటన కొనసాగించాలని కోరుకుంటున్నాను. ఆయన ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. ఆయన మాకు ఒక ఇన్స్పిరేషన్. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను, మిక్కీ గారు బ్లాక్బస్టర్ ఆల్బమ్ ఇచ్చారు. ఆయన పాటలే చాలా పెద్ద ఎత్తున ప్రమోషన్స్ చేసుకుంటూ వెళ్లాయి. ఆయన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అదిరిపోయింది. అనస్వర చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేసింది. తనతో మళ్ళీ కలిసి పనిచేయాలని ఉంది. ఈ సినిమాని ఇండస్ట్రీలో చాలా మంది సపోర్ట్ చేశారు. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఛాంపియన్ ఎప్పటికీ నాకు స్పెషల్ ఫిలిం. ఈ సినిమాకి పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సినిమా మా అందరికీ స్పెషల్. ఇది ఫ్యామిలీ మూవీ. అందరూ కూడా ఫ్యామిలీతో కలిసి వెళ్లి చూడాలని కోరుకుంటున్నాను." అన్నాడు.



## రాజుగారి పెళ్లిరో..

వరుసగా మూడు ఘన విజయాలతో ప్రేక్షకుల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి, 2026 సంక్రాంతికి తన తదుపరి చిత్రం 'అనగనగా ఒక రాజు'తో అలరించనున్నారు. ప్రచార చిత్రాలలో వైవిధ్యం చూపిస్తూ, ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్న ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన మొదటి గీతం 'భీమవరం బాల్మా' ఆకట్టుకుంది. తాజాగా ఈ చిత్రం నుంచి రెండవ గీతంగా 'రాజు గారి పెళ్లిరో' విడుదలైంది. 'అనగనగా ఒక రాజు' నుంచి డ్యాన్స్ నంబర్ గా విడుదలైన 'రాజు గారి పెళ్లిరో' పాట కట్టిపడేస్తోంది. మాస్ తో పాటు, అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా ఉత్సాహభరితంగా సాగిన ఈ గీతం.. పండగ వాతావరణాన్ని ముందే తీసుకొని వచ్చింది. తెలుగు ప్రేక్షకుల హృదయాలలో ఎప్పటికీ నిలిచిపోయే పెళ్లి పాటలలో ఒకటిగా ఇది నిలుస్తుంది అనడంలో సందేహం లేదు. ఈ పాటలో నవీన్ పొలిశెట్టి, మీనాక్షి చౌదరి ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమ అసాధారణ ఎనర్జీతో పాటను మరో స్థాయికి తీసుకొని వెళ్లారు. ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ సమకూర్చిన అద్భుతమైన నృత్య రీతులతో ఈ పాటను భారీ స్థాయిలో తెరకెక్కించారు. రావు రమేష్ సహా ప్రధాన నటీనటులంతా పాల్గొనడంతో దృశ్య పరంగా ఈ పాట మరింత సంపన్నంగా, సంబరంగా మారింది. తొలి పాట 'భీమవరం బాల్మా'కు లభించిన అద్భుతమైన స్పందన తర్వాత, ఇప్పుడు చిత్ర బృందం ఈ పెళ్లి గీతంతో మరోసారి ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. 'రాజు గారి పెళ్లిరో'ను అనురాగ్ కులకర్ణి, సమీరా భరద్వాజ్ ఆలపించగా, చంద్రబోస్ సాహిత్యం అందించారు. మిక్కీ జె. మేయర్ సంగీతం ఈ పాటను పండగ గీతంగా మలిచాయి. రంగురంగుల దృశ్యాలు, ఉత్సాహభరితమైన నృత్య రీతులు, కాలు కదిపేలా చేసే సంగీతంతో ఈ పాట నిజమైన సంబరాన్ని ప్రతిబింబిస్తుంది.



## 'మారెమ్మ' షూటింగ్ పూర్తి

రవితేజ సోదరుడు రఘు కుమారుడు యంగ్ చాప్ మాధవ్ రూరల్ రస్టిక్ మూవీ 'మారెమ్మ'తో హీరోగా సినిమాల్లోకి అడుగుపెడుతున్నారు. ఈ హైఆక్టేన్ ప్రాజెక్ట్‌ను మంచాల నాగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై మయూర్ రెడ్డి బండారు తమ ప్రొడక్షన్ నంబర్ 1గా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్ లో మాధవ్ ఎద్దును నడిపిస్తూ ధైర్యంగా ముందుకు వస్తూ ఇంటెన్స్ లుక్ లో కనిపించారు. బ్యాక్ డ్రాప్ లో శక్తివంతంగా కనిపించే కాళీదేవి విగ్రహం, చుట్టూ గ్రామీణ పండుగ వాతావరణం, జనసందడి, ఉత్సవ ఉత్సాహంతో పాటు ఒక పవర్ ఫుల్ సంఘటనకు సంకేతంగా కనిపిస్తోంది. ఈ చిత్రంలో మాధవ్ సరసన దీపా బాలు కథానాయిక గా నటిస్తోంది. వినోద్ కుమార్, వికాస్ వశిష్ఠ, దయానంద్ రెడ్డి, వి.ఎస్.రూప లక్ష్మి ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రశాంత్ అంకిరెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, ప్రశాంత్ ఆర్ విహారి సంగీతం అందిస్తున్నారు. దేవ్ రాథోడ్ ఎడిటర్, రాజ్‌కుమార్ మురుగేశన్ ఆర్ట్ డైరెక్టర్.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200